Sweken IT Solutions

WE ARE HIRING !!

POWER BI SPECIALIST
DATA ANALYST

INTERESTED CANDITATES
PLEASE SEND YOUR RESUME TO
MAIL: careers@sweken.com
PH: 9100986585



VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM

Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com


# విశాఖ సమాచారమ్

**మీ నెట్వర్క్ బలం..**

మీకు ఎంతమంది వ్యక్తులు తెలుసన్నదానిపై ఆధారపడి ఉండదు. మీకు అవసరమైనప్పుడు చేయూత అందించేందుకు ఎంతమంది ముందుకొస్తారన్న దానిపైనే ఆధారపడి ఉంటుంది. ఎందుకూ పనికిరాని వందల మందితో కలిసి ఉండటం కంటే.. శక్తిమంతమైన కొందరితో చెలిమి చేయడం ఉత్తమం. –

అలెక్స్ హార్మోజీ, బిజినెస్ గ్రోత్ కోచ్


RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 142 విశాఖపట్నం, 15 మార్చి 2025 శనివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00




## సింహాద్రి అప్పన్నకు పెళ్లిచూపులు
## వైభవంగా డోలోత్సవం



సింహాచలం, (విశాఖ సమాచారమ్):- విశాఖపట్నం జిల్లా సింహాచలం పుణ్యక్షేత్రంలో ఫాల్గుణ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని అప్పన్న స్వామి పెళ్లి చూపులు ఉత్సవం, డోలోత్సవం సంప్రదాయ బద్ధంగా జరిగాయి. అర్చకులు స్వామి, అమ్మవార్లను సింహగిరి పైనుంచి మెట్ల మార్గంలో కొండ దిగువకు తీసుకొచ్చారు. పుష్కరిణి ఉద్యాన మండపంలో దేవతామూర్తులను ఉయ్యాలలో అధిష్ఠించి చూర్ణోత్సవం,

(మిగతా 2లో)

అమ్మాయి వలపు వలలో పడి

## మిలిటరీ రహస్యాలు పాక్‌కు లీక్



ఫిరోజాబాద్: పాకిస్థాన్ ఐఎస్ఐకు గూఢ చర్యం చేస్తూ.. భారత రక్షణ రంగానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని శత్రువులకు చేరవేస్తున్నాడన్న ఆరోపణలపై ఉత్తరప్రదేశ్‌లో ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఓ అమ్మాయి వలపు వల లో చిక్కిన అతడు.. భారత సైన్యం ఆయుధాలకు సంబంధించిన సున్నితమైన సమాచారంతో పాటు గగన్‌యాన్ ప్రాజెక్టు వివరాలను అందించినట్లు విచారణలో తేలింది.

ఉత్తరప్రదేశ్‌కు చెందిన రవీంద్ర కుమార్ ఫిరోజాబాద్‌లో హజ్రత్‌పుర్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో మెకానిక్‌గా

(మిగతా 2లో)

# నామినేటెడ్ పదవుల భర్తీకి కసరత్తు

- సంక్షేమ కార్యక్రమాల అమలులో వివక్ష ఉండదు
- టీడీపీ ప్రజాప్రతినిధులతో సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్

అమరావతి, (విశాఖ సమాచారమ్):- నామినేటెడ్ పదవుల భర్తీకి కసరత్తు చేస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. పేర్లను సిఫారసు చేసేందుకు కొంతమంది నేతలు ఆలస్యం చేస్తున్నారని చెప్పారు. ఆయా పదవుల కోసం పార్టీకి కష్టపడిన వారి వివరాలు అందించాలని కోరారు. టీడీపీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో సీఎం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

"సరైన వ్యక్తులను సరైన పదవుల్లో నియమిస్తాం. రాష్ట్రవ్యాప్తంగా 21 ప్రధాన ఆలయాలకు ఛైర్మన్ల నియామకం చేపడతాం. నామినేటెడ్ పదవుల కోసం 60వేల దరఖాస్తులు వచ్చాయి. వాటిని నిశితంగా పరిశీలిస్తున్నాం. మొదటిసారే



పదవులు రాలేదని అనుకోవద్దు. రెండేళ్ల పదవీకాలం ముగిశాక మిగిలినవారికి అవకాశాలు కల్పిస్తాం. ఇప్పటికే పదవులు తీసుకున్నవారి ప్రతిభను పర్యవేక్షిస్తున్నాం. ప్రతిపక్షంలో ఉన్నట్లే ఇప్పుడూ హుందాగా వ్యవహరించాలి.

తెదేపా నేతలు ఏ స్థాయిలోనూ వైసీపీ నేతలతో సంబంధాలు పెట్టుకోకూడదు. నేను ఇలా చెబితే.. వైసీపీకి ఓటేసిన వారికి పథకాలు ఇవ్వొద్దన్నట్లు ప్రచారం చేస్తున్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో వివక్ష ఉండదు. పార్టీలకు అతీతంగా పథకాలు అందజేస్తున్నాం. సంక్షేమ పథకాలు వేరు.. రాజకీయ సంబంధాలు వేరు. పార్టీలో గ్రూపు రాజకీయాలకు తావివ్వకుండా చూసే బాధ్యత మంత్రులదే. జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులు వారి జిల్లాల్లో పర్యటనల సంఖ్య పెంచాలి. కూటమిలోని మూడు పార్టీల నేతలు, కార్యకర్తలను కలుపుకొని ముందుకెళ్లాలి" అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

# అమరావతి పనుల పునఃప్రారంభం

## ఏప్రిల్ 15-20 మధ్య ప్రధాని మోదీ రాక?

అమరావతి, (విశాఖ సమాచారమ్): – రాజధాని అమరావతి పునర్నిర్మాణాన్ని ఏపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. రాజధానిలో నవ నగరాల నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రధాని మోదీ చేతుల మీదుగా చేయించాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఏప్రిల్ 15 నుంచి 20 తేదీల మధ్య అమరావతికి ప్రధాని వచ్చే అవకాశముంది.

తొలి దశలో రాజధానిలో నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.64,721 కోట్లు వెచ్చించనుంది. రూ.37,702 కోట్ల పనులకు ఇప్పటికే టెండర్లు ఖరారు చేసింది. నిర్మాణ పనులను మిషన్ మోడ్‌లో



చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈనెల 17న రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ఆమోదం తర్వాత కాంట్రాక్ట్ ఏజెన్సీలకు అగ్రిమెంట్ లెటర్లు జారీ చేయనుంది. వర్క్ ఆర్డర్లు జారీ కాగానే ఏజెన్సీలు పనులను ప్రారంభించనున్నాయి.

# ఉత్సాహంగా సప్త వర్ణాల హోలీ



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు హోలీ వేడుకలు శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. విశాఖ బీచ్‌లో యువత కేరంతలు కొడుతూ రంగులు చల్లుకొని ఉత్సాహంగా గడిపారు. అందరూ తమ ఆత్మీయులతో రంగుల కేళీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్న పెద్ద అనే తేడా లేకుండా అందరూ సంబరాలు చేసుకున్నారు.. రంగులు చల్లుకోవడమే కాదు.. వయసుతో సంబంధం లేకుండా చిందులు కూడా వేశారు. ప్రజాప్రతినిధులు సైతం కార్యకర్తలు, ప్రజలతో రంగుల పండుగను కలర్ ఫుల్‌గా నిర్వహించుకున్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరిగిన హోలీ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ హెూలీ వేడుకల్లో టీడీపీ ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి డ్యాన్సులతో అదరగొట్టారు. 'జై బాలయ్య' అనే పాటకు స్టెప్పులేసి అందరిలో ఫుల్ జోష్ నింపారు.

# ఏపీలో నేటి నుంచి ఒంటిపూట బడులు



అమరావతి, (విశాఖ సమాచారమ్):- రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా.. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ఒంటిపూట బడులు నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 24 వరకు ఒంటిపూట బడులు కొనసాగనున్నాయి. ఆ తరువాత జూన్ 12 వరకు వేసవి సెలవులు కొనసాగనున్నాయి. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ తాజా ఉత్తర్వుల్తో ఆఫ్ డే స్కూల్ టైమింగ్స్ వెల్లడిరచింది. ఏపీలో ఉదయం 7.45 గంటల నుంచి 12.30 గంటల వరకు ఒంటిపూట బడులు నిర్వహిస్తారు. పదో తరగతి పరీక్షా కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించేలా విద్యాశాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు ఒంటిపూట బడులు కొనసాగుతాయి. పదో తరగతి పరీక్షలు జరుగుతున్న సెంటర్లలో మాత్రం మధ్యాహ్నం 1.00 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# జనసంద్రమైన పిఠాపురం





పిఠాపురం, (విశాఖ సమాచారమ్):- జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభ కాకినాడ జిల్లా పిఠాపురం మండలంలోని చిత్రాడలో ప్రారంభమైంది. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల నుంచి జనసైనికులు తరలిరావడంతో పిఠాపురం జనసంద్రంగా మారింది. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఎమ్మెల్యేగా నెగ్గిన పిఠాపురం నియోజకవర్గం సభకు ఆతిథ్యం ఇస్తుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. పోటీ చేసిన అన్ని స్థానాల్లో గెలుపొందినందున 'జయకేతనం' పేరుతో సభ నిర్వహించారు. స్వాగత మార్గాలను కొబ్బరి ఆకులు, ఫ్లెక్సీలు, జెండాలతో అలంకరించారు. వివిధ నియోజకవర్గాల నుంచి జనసైనికులు కార్లు, బస్సులు, లారీలు, ద్విచక్ర వాహనాల్లో తరలిరావడంతో పలు చోట్ల ట్రాఫిక్ జామ్ అయింది. ఆరు చోట్ల పార్కింగ్ ప్రాంగణాలు, నాలుగు చోట్ల భోజన వసతులు, ఎక్కడికక్కడ చలివేంద్రాలు, ఏడు చోట్ల వైద్యశిబిరాలు, 14 అంబులెన్స్‌లు ఏర్పాటు చేశారు. 1,700 మంది పోలీసులకు సాయంగా

(మిగతా 2లో)

# చంద్రబాబు సెంటిమెంట్.. మరో సారి రిపీట్ !

- ఏ పనితలపెట్టినా శ్రీవారి పూజలతో మొదలుపెట్టే ఆనవాయితీ
- రాజధాని పనుల పునః ప్రారంభం వేళ అమరావతిలో వెంకన్న కళ్యాణోత్సవానికి భారీ ఏర్పాట్లు
- ఆ ప్రాంత రైతులందరికీ ఆహ్వాన పత్రికలు



అమరావతి, (విశాఖ సమాచారమ్): – ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. ఎక్కడికి వెళ్లినా వెంకటేశ్వర స్వామి ఫొటోలు, ప్రసాదాన్ని వెంట తీసుకెళ్తుంటారు. పెట్టుబడుల కోసం విదేశాలకు వెళ్లినా.. ఢిల్లీ పెద్దలతో సమావేశాల్కైనా తోడుగా శ్రీవారి ప్రతిమలు, ప్రసాదాలు ఉండాల్సిందే! ఎందుకంటే.. శ్రీవారి ఆశీస్సులతో ఏ పని తలపెట్టినా సక్సెస్ అవుతుందని చంద్రబాబు నమ్ముతుంటారు. అందుకే ఏద్కైనా పనులు ప్రారంభించే ముందు శ్రీవారిని దర్శించుకోవడమో.. ప్రత్యేక కార్యక్రమాలతో ఆయనను తలచుకోవడమో చేస్తుంటారు. ఇప్పుడు ఈ సెంటిమెంట్ మరోసారి రిపీట్ అవుతోంది.

రెండవసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఏపీ రాజధాని అమరావతిపై చంద్రబాబు మళ్లీ స్పెషల్ ఫోకస్ పెట్టారు. అధికారంలోకి రాగానే అమరావతి రూపు రేఖలు మార్చేందుకు శ్రీకారం చుట్టారు. దానిలో భాగంగా.. అమరావతిలోని ముళ్ల కంపలు, చెట్లు, చెదారాన్ని తొలగించే పనులకు ఆదేశాలు ఇచ్చారు. ఆయా పనులు పూర్తవడంతో అమరావతి మళ్లీ ఊపిరి పోసుకుంటోంది. అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. నవ్యాంధ్ర ఏర్పాటు తర్వాత ఫస్ట్ టర్మ్ సీఎం అయిన సమయంలో రాజధాని ఏర్పాటుకు

(మిగతా 2లో)

# స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల నిరసన

# అనుమతి నిరాకరణ



గాజువాక, (విశాఖసమాచారమ్): విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా శుక్రవారం రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు ఉద్యోగులు పిలుపునిచ్చిన నేపథ్యంలో అక్కడక్కడా ఆందోళనలు చేశారు. పలుచోట్ల కార్మికుల నిరసనకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యోగుల నిరసనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం స్టీల్‌ప్లాంట్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాలని అఖిలపక్ష కార్మిక సంఘాలు భావించినా గాజువాక పరిసరాల్లో నిరసనలు చేసేందుకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. పెద్ద సంఖ్యలో పోలీసులు మోహరించారు.

నిరసనలకు ఇలాంటి ఆంక్షలు ఎన్నడూ లేవని కార్మిక సంఘాల నేతలు చెబుతున్నారు. ఈ క్రమంలో కుర్మన్నపాలెం దీక్ష శిబిరంలోనే కార్మిక నేతలు నిరసన తెలిపారు.

(మొదటి పేజీ తరువాయిలు)

### సింహాద్రి అప్పన్నకు పెళ్లిచూపులు
## వైభవంగా డోలోత్సవం

వసంతోత్సవం, ఉయ్యాల సేవలు నిర్వహించారు. అప్పన్న స్వామి సోదరి, పైడితల్లి అమ్మవారి కుమార్తెతో స్వామికి పెళ్లి కుదిరిన సందర్భంగా అర్చకులు, గ్రామస్థులు ఆనందోత్సాహాల నడుమ రంగులు చల్లుకొని వేడుకలు నిర్వహించారు. డోలోత్సవం అనంతరం స్వామి అమ్మవార్ల గ్రామ తిరువీధి మహోత్సవం కనుల పండువగా సాగింది. ఏప్రిల్ 8న సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారి వార్షిక తిరు కల్యాణోత్సవం, రథోత్సవం వైభవంగా జరగనున్నాయి.

## అమ్మాయి వలపు వలలో పడి మిలిటరీ రహస్యాలు పాక్‌కు లీక్

పనిచేస్తున్నాడు. గతేడాది అతడికి నేహా శర్మ అనే మహిళ ఫేస్‌బుక్‌లో పరిచయమైంది. పాక్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ కోసం పనిచేస్తున్న ఆమె.. ఆ విషయాన్ని దాచిపెట్టి రవీంద్రతో స్నేహం చేసింది. డబ్బుల ఆశ జూపి వలపు వల విసిరింది. అనంతరం అతడి నుంచి మిలిటరీ రహస్యాల ను సంపాదించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

చంద్రన్ స్టోర్‌కీపర్ పేరుతో ఆమె నంబరును సేవ్ చేసుకున్న రవీంద్ర.. వాట్సప్‌లో ఆమెకు అనేక కీలక పత్రాలు పంపించినట్లు పోలీసులు గుర్తించారు. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, 51 గోరా? రైఫిల్స్ రెజిమెంట్ అధికారులు నిర్వహించిన లాజిస్టిక్స్ డ్రోన్ పరీక్షలు, రోజువారీ ఉత్పత్తి వివరాలు, స్క్రీనింగ్ కమిటీ పంపిన రహస్య లేఖలను సంపాదించి వాటిని ఆ మహిళకు పంపించినట్లు తెలిసింది. ఇందులో గగన్‌యాన్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు కూడా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అంతేకాదు.. పాక్ కేంద్రంగా పనిచేస్తోన్న ఐఎస్ఐ సభ్యులతోనూ అతడు నేరుగా టచ్‌లో ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది. భారత రక్షణ రంగ ప్రాజెక్టులకు సంబంధించిన నిఘా సమాచారాన్ని వారికి పంపించి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. నిందితుడితో పాటు అతడి స్నేహితుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. వారి వాట్సప్ చాట్‌లను పరిశీలిస్తున్నారు.

## చంద్రబాబు సెంటిమెంట్.. మరో సారి రిపీట్ !

శ్రమించిన చంద్రబాబు.. ఇప్పుడు మరోసారి పునరుజ్జీవం చేస్తున్నారు. ఈ క్రమంలోనే.. అమరావతిలో పనుల పునఃప్రారంభానికి సిద్ధమవుతున్నారు.

అయితే ఆయా కార్యక్రమాలకు ముందే కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంక టేశ్వరస్వామి సెంటిమెంట్‌ను ఫాలో అవుతున్నారు. అమరావతిలో శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించబోతున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో రాజధాని వేదికగా శనివారం శ్రీనివాస కల్యాణం జరగబోతోంది. ఈ కార్యక్రమానికి ఏపీ ప్రభుత్వం పెద్దయెత్తున ఏర్పాట్లు చేస్తోంది. రాజధానిలోని ప్రతి ఇంటికి ఆహ్వాన పత్రిక అందించడంతో పాటు అమరావతి రైతులందరూ శ్రీవారి కల్యాణ మహోత్సవానికి హాజరుకావాలని టీటీడీ ఆధ్వర్యంలో ఆహ్వానించారు. శ్రీనివా సుని కల్యాణం తర్వాత ఏప్రిల్‌లో అమరా వతి పనుల పునః ప్రారంభించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి.

ఏ పని చేసినా శ్రీవారి నామస్మరణ తర్వాతే అని గతంలోనే చంద్రబాబు పలు మార్లు చెప్పారు. దానిలో భాగంగానే.. గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలవగానే ముందుగా తిరుమల శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి.. మొక్కులు చెల్లించుకున్నారు. ఆ తర్వాత పాలనా పరమైన ప్రక్షాళన కూడా తిరుమల నుంచే ప్రారంభించారు. ఇప్పుడు కూడా అమరావతిలో పనుల పునః ప్రారం భానికి శ్రీవారి సెంటిమెంట్‌ను అనుసరి స్తున్నారు. అమరావతిలో శ్రీవారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేయిస్తున్నారు. శ్రీవారి కల్యాణోత్సవం తర్వాత ఏప్రిల్ రెండో వారం లో అమరావతికి మోదీ రాబోతున్నారు. రాజధాని అభివృద్ధి పనులను పునఃప్రారంభించనున్నారు. శ్రీవారి నామస్మరణ తర్వాత ఏ పని చేసినా సక్సెస్ అవుతుందని భావించే చంద్రబాబు.. ఇప్పుడు మరోసారి వెంకన్న సెంటిమెంట్‌ను ఫాలో అవుతున్నారనేది స్పష్టమవుతోంది.

## జనసంద్రమైన పిఠాపురం



500 మంది పార్టీ వాలంటీర్లతో భద్రత ఏర్పాటు చేశారు. సభకు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ, విదేశాల నుంచి జనసైనికులు తరలి వచ్చారు. దీంతో పిఠాపురం పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి.

**జనసేనానికి సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు**

జన'సేవా' నిబద్ధత, విలువలతో కూడిన రాజకీయాలకు ప్రతీకగా కొనసాగుతోన్న జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ , పార్టీ ముఖ్య నాయకులకు, జనసైనికులకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పవన్‌తో కలిసి ఉన్న ఫొటోను చంద్రబాబు షేర్ చేశారు.

**పవన్ అన్నకు అభినందనలు: లోకేశ్**

'జనసేన 12వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పవన్ కల్యాణ్ అన్నకు అభినందనలు. జనసేన నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు. ఏపీ ఆర్థిక, సామాజిక వృద్ధికి జనసేన నిబద్ధత ప్రశంసనీయం. రాష్ట్ర పురోగతి, శ్రేయస్సులో జనసేనపాత్ర అందరికీ ఉజ్వల భవిష్యత్తును ప్రేరేపిస్తుంది' అని ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ ట్వీట్ చేశారు.

# కళ్యాణోత్సవం, చందనోత్సవాలకు పక్కా ఏర్పాట్లు

డోలోత్సవంలో పాల్గొన్న భీమిలి ఎమ్మెల్యే గంటా



**సింహాచలం, (విశాఖ సమాచారమ్):-** సింహాచలం శ్రీ వరహా నృసింహ స్వామి వారి కళ్యాణోత్సవం, చందనోత్సవ పర్వ దినాలు విజయవంతంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో కలిసి ఈ పండుగల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కళ్యాణోత్సవానికి అంకురార్పణ చేసే డోలోత్సవంలో శుక్రవారం పాల్గొన్న ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ పవిత్ర హెూళీ రోజున స్వామి వారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. ఏప్రిల్ 8 న జరిగే కళ్యాణోత్సవం, 30 న జరిగే చందనోత్సవం భక్తులకు మధుర స్మృతిగా ఉండేలా అన్ని ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. స్వామి వారి సన్నిధిలో జరిగే అన్ని కార్యక్రమాలు విజయ వంతం కావాలని ఆకాక్షించారు. రూ.54 కోట్లతో జరుగుతున్న ప్రసాద్ స్కీం పనులు చందనోత్సవం సమయానికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు కొండ దిగువున పుష్కరిణీ మండపంలో జరిగిన స్వామివారి డోలోత్సవంలో పాల్గొన్న గంటా శ్రీనివాస రావు ప్రత్యేక పూజలు చేశారు. కార్య క్రమంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.సుబ్బారావు, ఏఈఓ ఎన్. ఆనంద్ కుమార్, ప్రధాన అర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కార్పొరేటర్ పి.వి. నరసింహం, పార్టీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కుకు సొంత గనులివ్వాలి

కాంట్రాక్టు కార్మికుల తొలగింపులు,నాయకులపై నిర్బంధం ఆపాలి - కార్మిక,ప్రజా సంఘాల జెఏసి డిమాండ్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** విశాఖ ఉక్కుకు స్వంతగనులు కేటాయించి, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడిపించాలని, కాంట్రాక్టు కార్మికుల తొలగింపులు, పర్మినెంట్ యూనియన్ నాయకులపై అక్రమ షోకాజ్ నోటీసులు రద్దు చేయాలని విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి డిమాండ్ చేసింది.

జెఎసి ఆధ్వర్యంలో శుక్రవారం జివియంసి గాంధీ విగ్రహం వద్ద నుండి ఆర్టీసి కాంప్లెక్స్ గురజాడ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన, కూడలిలో మానవహారం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కెఎస్‌వి కుమార్ అధ్యక్షతన సభ జరిగింది.సభలో జెఎసి ఛైర్మన్ ఎం. జగ్గునాయుడు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి. నాగభూషణం, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్. కనకారావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం విశాఖ ఉక్కు కార్మికులు గాజువాకలో ఈరోజు తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని ప్రభుత్వం పోలీసుల ద్వారా అడ్డుకోవడాన్ని, స్టీల్‌ప్లాంటు నేతల పై నిర్బంధ చర్యలను జెఎసి తరపున తీవ్రంగా ఖండించారు. వైసిపి ప్రభుత్వ నిర్బంధ కాండను వ్యతిరేకించిన కూటమినేతలు అధికారం చేపట్టాక అవే నిర్బంధ చర్యలకు పూనుకోవడం అమానుషమన్నారు.ఈ చర్యలను వెంటనే విడనాడాలని డిమాండ్ చేశారు.విశాఖ ఉక్కు అభివృద్ధికై రూ.11440కోట్లు ఆర్థిక ప్యాకేజీ ప్రకటించామని, ప్లాంటును లాభాల బాట పట్టించడమే తమ ధ్యేయమని కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర కూటమినేతలు ప్రకటించారన్నారు. ప్యాకేజీతోనే ప్లాంటు ప్రైవేటీకరణ సమస్యను పరిష్కారం చేసేసినట్లు ప్రజలను నమ్మింప జూసారన్నారు. ఈ ప్రకటనలకు ఆచరణ పూర్తి విరుద్ధంగా వుందన్నారు.ప్రకటించిన ప్యాకేజీలో సంస్థ ఉత్పత్తికి, ముడిసరుకుకు, కార్మికుల జీతాలకు నిధులు ఖర్చుచేయడం లేదన్నారు. పాత బ్యాంకు బకాయిలు తీరుస్తున్నారన్నారు. కార్మికులకు 210 శాతం జీతాలు చెల్లించలేదన్నారు. పూర్తిస్థాయి ఉత్పత్తి జరగాలంటే సుమారు 40 వేల మంది పర్మినెంటు, కాంట్రాక్టు కార్మికులు అవసరమని, అయితే కానీ నేడు 5 వేల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయడంలేదన్నారు. 1100 మంది పర్మినెంటు కార్మికులను విఆర్ఎస్ పేరుతో బయటకు పంపుతున్నారన్నారు. 3 నెలలకు 1400 మంది చొప్పున ఈ ఏడాది 5,600 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించడానికి సిద్ధపడ్డారన్నారు. ఇప్పటికే సుమారు 960 మందిని రకరకాల పేర్లతో తొలగించారన్నారు. వేలమంది కార్మికులను తొలగిస్తే సంస్థ పూర్తిస్థాయి ఉత్పత్తి ఎలా సాధ్యమని జెఏసి నేతలు ప్రశ్నించారు. ఉత్పత్తి కారకులైన పర్మినెంటు కార్మికులకు 210 శాతం జీతాలు చెల్లించకుండా, కాంట్రాక్టు కార్మికులకు పూర్తిస్థాయి జీతాలివ్వకుండా వీరిని ఆర్థికంగా దెబ్బతీయడం దుర్మార్గమన్నారు. కార్మికులు వారంతట వారే ఉద్యోగం వదిలి వెళ్లిపోయేలా చేయడం, కార్మికుల సంఖ్యను భారీగా తగ్గించడం, సంస్థకు అప్పులు లేకుండా చేసి ప్రైవేటుకు కట్టబెట్టాలనే కుట్రలు కేంద్రం చేస్తున్నట్లు ఈ పరిణామాలు నిరూపిస్తున్నాయని ఆరోపించాడు.ఈ కుట్రలను ఐక్యంగా ప్రతి ఘటించాలని కార్మికులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. విఆర్ఎస్, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు, కార్మికుల కరెంటు ఛార్జీలు పెంపు వంటి సమస్యలపై మాట్లాడటం ప్రభుత్వ, యాజమాన్య వ్యతిరేక చర్యగా వర్ణించి యూనియన్ నాయకులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం కార్మిక చట్టాలను, హక్కులను కాలరాయడమేనన్నారు. యూనియన్లను లేకుండా చేసి, పోరాటాన్ని బలహీనపరచి,ప్లాంటును ప్రైవేటుకు కట్టబెట్టేందుకు ఈ చర్యలని దుయ్యబట్టారు.ఈఅక్రమ నోటీసులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంస్థ కోసం తమ భూములను,ఆస్తులను త్యాగం చేసిన నిర్వాశితులు నేటికీ 8,500మంది ఉద్యోగాలు రాక అనేక అవస్థలు పడుతున్నారని వీరికి వెంటనే పర్మినెంటు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టేలా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలని డిమాండ్ చేసారు.సభలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె అచ్యుతరావు, ఎఐసిసిటియు జిల్లా కార్యదర్శి వాసుదేవరావు, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.తిరుపతిరావు,ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి.పద్మ, మహిళాసమాఖ్య జిల్లా కార్యదర్శి ఎం.ఎ బేగం, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యు.ఎస్.ఎన్.రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జె నాయుడు, కెవిపిఎస్ జిల్లా నాయకులు వై.రాజు, డిహెచ్‌పిఎస్ జిల్లా నాయకులు జి.రాంబాబు, ఐఎన్‌టియుసి నాయకులు కె.తాతబాబు, పెన్షనర్ల సంఘం ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు కె. సత్యనారాయణ తదితరులు ప్రసంగిస్తూ రాష్ట్రంలోని టిడిపి, జనసేన,బిజెపి కూటమి ప్రభుత్వం, కేంద్ర బిజెపి ప్రభుత్వ కుట్రలను నిలువరించి, స్టీల్‌ప్లాంటుకు స్వంతగనులు సాధన, పూర్తి ఉత్పత్తి సామర్థ్యంలో నడిపించి, లాభాలబాట పట్టేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు,సిఐటియు జిల్లా నాయకులు పి.మణి,బి.జగన్,వి. క్రిష్ణారావు, పి. పైడిరాజు, ఎం.సుబ్బారావు, ఉరుకూటి రాజు, బి.వెంకటరావు, ఎఐటియుసి నాయకులు ఎస్.కె. రెహమాన్,పి. చంద్రశేఖర్, కె.సత్యనారాయణ, జిల్లా మహిళా సంఘాల నేతలు,బి.ఈశ్వరమ్మ, బి.రమణి,బి.భారతి, పుష్ప,దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సీబీ'ఐ' చేతిలో రన్యారావు కేసు

### నేతలు, బ్యూరోక్రాట్ల గుండెల్లో గుబులు



**బెంగళూరు:** రన్యారావు కేసులో సీబీఐ చేస్తోన్న దర్యాప్తు రాజకీయ నేతలు, అధికారుల గుండెల్లో అలజడి సృష్టిస్తోంది. దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తీసుకొస్తూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయిన కన్నడ నటి రన్యా రావు వ్యవహారం సంచలనం సృష్టిస్తోంది. సీబీఐ దర్యాప్తు వేళ కీలక విషయం వెలుగులోకి వచ్చింది. అవినీతి నిరోధక చట్టం కింద నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో నిందితుల పేర్లు రాసేందుకు కేటాయించిన కాలమ్‌ను దర్యాప్తు సంస్థ బ్లాంక్‌గా ఉంచినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.

రన్యారావు కేసులో రాజకీయ నేతలు, అధికారుల పాత్ర ఉండొచ్చని కొద్దిరోజులుగా వార్తలు వస్తున్నాయి. ఈ కేసు నుంచి బయటపడేసేందుకు రాష్ట్ర ప్రభుత్వంలోని మంత్రులను ఆమె సంప్రదించినట్లు కథనాలు వెలువడ్డాయి. అలాగే ఆమె బంగారం తరలించే సమయంలో విమానాశ్రయంలో వీఐపీ ప్రొటోకాల్‌ను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భద్రతా తనిఖీలను తప్పించుకునేందుకు ఆమె సవతి తండ్రి, సీనియర్ ఐపీఎస్ అధికారి కె.రామచంద్రరావు పేరును ఉపయోగించుకున్నారనేది ప్రధాన ఆరోపణ. ఈ నేపథ్యంలో సూత్రధారుల పాత్ర గుర్తించే దిశగా సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. అప్పటివరకు నిందితుల కాలమ్‌లో అనుమానితులుగా అన్‌నోన్ పబ్లిక్ సర్వెంట్లు, ప్రైవేటు పర్సన్స్ పదాలను పేర్కొంది. దాంతో ఈ కేసులో అనుమానితులుగా భావించిన ఎవరికైనా సీబీఐ సమన్లు ఇవ్వొచ్చని తెలుస్తోంది. ఈ ముమ్మర దర్యాప్తు నేతలు, బ్యూరోక్రాట్ల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. కొందరు వ్యక్తులు సిండికేట్‌లా ఏర్పడి ఈ దందాను నడిపిస్తున్నట్లు గుర్తించిన డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ తదుపరి దర్యాప్తు నిమిత్తం సీబీఐకి ఫిర్యాదు చేసింది.

బంగారం అక్రమ రవాణా వ్యవహారానికి సంబంధించి మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా బెంగళూరు సహా అనేక చోట్ల దాడులు చేపట్టింది. రాజధానిలోనే ఎనిమిది చోట్ల సోదాలు చేసినట్లు సమాచారం. ఈ రాకెట్‌లో భారీ కుట్ర దాగి ఉన్నట్లు అనుమానిస్తున్న ఈడీ ఆ దిశగా దర్యాప్తు చేస్తోంది. ఇదిలా ఉంటే.. రన్యా పెళ్లికి సీఎం కూడా హాజరైన విషయాన్ని మీడియా ప్రశ్నించగా.. ఆయన వేల వివాహాలకు హాజరయ్యారంటూ కర్ణాటక హెూంమంత్రి ఆగ్రహంగా సమాధానమివ్వడం గమనార్హం.

## విశాఖ 'జూ'లో చిరుత మృతి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** విశాఖపట్నం ఇందిరా గాంధీ జయంతి ప్రదర్శనశాలలో ఒక చిరుత పులి మృతి చెందింది. సుధా అనే పేరుతో పిలిచే ఈ ఆడ చిరుత వయోభారంతో మరణించిందని అధికారులు తెలిపారు. ఈ చిరుత వయసు 20 సంవత్సరాలని, గురువారం రాత్రి మృతి చెందిందని తెలిపారు. అడవుల్లో చిరుతలు సహజంగా 10 నుంచి 12 సంవత్సరాలు జీవిస్తాయని అయితే 'జూ'లో రక్షణలో ఉండటం వల్ల ఈ చిరుత 20 సంవత్సరాల పాటు బతికిందని తెలిపారు. నిబంధనల మేరకు అధికారుల సమక్షంలో ఖననం చేశారు.

## తెలంగాణ కమల దళపతి ఎంపిక మరింత ఆలస్యం?




**హైదరాబాద్:** తెలంగాణలో కమల దళపతి ఎంపిక మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర పగ్గాలు ఎవరికి అప్పగించాలనే అంశంపై జాతీయ నాయకత్వం తర్జనభర్జన పడుతోంది. తెలంగాణలో బీసీ వాదం బలంగా వినిపిస్తోన్న నేపథ్యంలో అధ్యక్షుడి ఎంపిక సవాల్‌గా మారింది. ఏప్రిల్‌లో జాతీయ అధ్యక్షుడి ప్రకటన ఉంటుందని భావిస్తున్నారు. అప్పటిలోగా దేశంలోని సగానికిపైగా రాష్ట్రాలకు పార్టీ అధ్యక్షులను ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో తెలంగాణ అధ్యక్షుడి ఎన్నిక మార్చి నెలాఖరులోపు ఉంటుందని పార్టీ నేతలు అంచనా వేస్తున్నారు.

ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి కేంద్రంలో కీలకమైన బొగ్గు, గనుల శాఖ మంత్రిగా ఉన్నారు. దీంతో పార్టీ రాష్ట్ర నాయకత్వ బాధ్యతలను మరొకరికి అప్పగించాలని భాజపా నాయకత్వం గతంలోనే నిర్ణయించింది. భాజపా రాష్ట్ర అధ్యక్ష పదవికి ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, ధర్మపురి అర్వింద్, రఘునందన్‌రావులతోపాటు మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొంగిడి మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు తదితరుల పేర్లు సైతం వినిపిస్తున్నాయి. మురళీధర్‌రావు పేరు కూడా తెరపైకి రావచ్చని కొందరు నేతలు చెబుతున్నారు.

భాజపా రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల అధికారిగా కేంద్ర మంత్రి శోభా కరంద్లాజేను పార్టీ జాతీయ నాయకత్వం ఇప్పటికే నియమించింది. తెలంగాణ భాజపా పగ్గాలను పార్టీలో ముందు నుంచి ఉన్నవారికే ఇస్తారా? ఇతర పార్టీల నుంచి వచ్చి ముఖ్యనేతలుగా ఉన్న వారికి అవకాశం ఉంటుందా? అన్నది తేలాల్సి ఉంది. ఇటీవల రాష్ట్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో రెండు స్థానాలను భాజపా కైవసం చేసుకోవడం ఆ పార్టీ శ్రేణుల్లో జోష్ పెంచింది.

## మెకానికల్ డిపార్ట్మెంట్‌లో కల్చరల్ ప్రోగ్రాం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** శుక్రవారం స్థానిక బాబా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ఆధ్వర్యంలో పి.యం. పాలెం, విశాఖపట్నంలో మెకానికల్ డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యములో 5రోజుల జాతీయ లెవల్ సాంకేతిక ఫ్యూజన్ 2025: మాగ్నిఫయింగ్ వైబ్రేంట్ టెక్నా ఫెస్టివిటీ ఆస్ట్రా -3.0 భాగంగా 3వ రోజు కల్చరల్ ప్రోగ్రాం జరిగింది.

దీనిలో డ్యాన్స్, క్లాసికల్ డ్యాన్స్, ట్రెజర్ హంట్, ఇ-స్పోర్ట్స్ మొదలగునవి జరిగాయి. పై పోటీలు గెలిచిన విద్యార్థులకు కాలేజీ సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ శ్రీలక్ష్మి చేతుల మీదుగా బహుమతీ ప్రదానం జరిగింది.ఈ కార్యక్రమానికి అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## శ్రీవారి ఆలయంపై వెళ్లిన ఎనిమిది విమానాలు



**తిరుమల, (విశాఖ సమాచారమ్):-** శ్రీవారి ఆలయానికి సమీపంలో ఒక్కరోజే ఎనిమిది విమానాలు వెళ్లాయి. ఇవన్నీ ఉదయం 7.15 నుంచి 8 గంటల మధ్యన వెళ్లాయి. ఆగమశాస్త్రం ప్రకారం శ్రీవారి ఆలయంపై ఎటువంటి విమానాలు వెళ్లరాదు. అయితే ఇటీవల కాలంలో విమానాలు ఆలయానికి సమీపం నుంచే పోతున్నాయి. ఇప్పటికే దీనిపై తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడికి లేఖ రాసిన విషయం తెలిసిందే.

# కిడ్నీ వ్యాధితో యువకుడు మృతి



కొయ్యూరు, (విశాఖ సమాచారమ్):- కొయ్యూరు మండలం చింతవాని పాలెం గ్రామానికి చెందిన యువకుడు వయసు 30 సంవత్సరాలు కూని శెట్టి ఈశ్వరరావు గత సంవత్సర కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ కొంతకాలంగా ఇంటి వద్దనే ఉంటూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న కుమారుడు మరణించడంతో తల్లి కాసులమ్మ చెల్లి విజయ మేనత్త నూకాలమ్మ బాబాయ్ సోమరాజు శోకసముద్రంలో మునిగారు తమ కుటుంబంలో సర్వం అమ్ముకుని చికిత్స చేయించినప్పటికీ ప్రాణం దక్కలేదని వాపోయారు మృదుస్వభావి ఈశ్వరరావు మృతికి అనేక గ్రామాల నుంచి తరలివచ్చిన బంధుమిత్రులు కుటుంబ సభ్యులు కొయ్యూరు ఎంపీటీసీ కూని శెట్టి మల్లికార్జునరావు మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తెలుగుదేశం నాయకులు దుచ్చరి చిట్టిబాబు తమ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

## జిల్లా ప్రత్యేక అధికారి ఎ.బాబు నేడు జిల్లాకు రాక

విజయనగరం, (విశాఖ సమాచారమ్):- ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలుపై పర్యవేక్షణ చేసే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు నియమించిన ప్రత్యేక అధికారి, సీనియర్ ఐ.ఏ.ఎస్. అధికారి, రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ శ్రీ అహ్మద్ బాబు శనివారం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ తెలిపారు. ప్రత్యేక అధికారి ఉదయం 10 గంటలకు జిల్లాకు చేరుకొని స్వచ్ఛంధ్ర కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. 10-30 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించే సమావేశంలో పాల్గొని జిల్లాలో ప్రభుత్వ పథకాలు అమలు, ఆదాయ ఆర్జన శాఖల ద్వారా ప్రభుత్వ ఆదాయం పెంపుదల లో సాధించిన ప్రగతి తదితర అంశాలపై సమీక్షిస్తారని పేర్కొన్నారు.

## అయితే రాజ్యసభకు.. లేకుంటే విశ్రాంతి: యనమల



అమరావతి, (విశాఖ సమాచారమ్):- భవిష్యత్తులో పార్టీ అవకాశమిస్తే రాజ్యసభకు వెళతానని, లేకపోతే విశ్రాంత జీవితం గడుపుతానని తెదేపా సీనియర్ నేత యనమల రామకృష్ణుడు తెలిపారు. శాసనమండలి సభ్యుడిగా ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న తనను.. ఆ తర్వాత ఏం చేస్తారని అడుగుతున్న సన్నిహితులు, శ్రేయోభిలాషులకు ఇదే సమాధానం చెబుతున్నానని పేర్కొన్నారు. ఆయన గురువారం శాసనసభ లాబీల్లో మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు.

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు తెదేపా అభ్యర్థుల్ని ప్రకటించిన రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు తనతో ఫోన్‌లో మాట్లాడారని తెలిపారు. ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ఫలానా వారిని ఎంపిక చేశామని ఆయన చెబితే... స్వాగతించానని చెప్పారు. తనకు రెండుసార్లు శాసనమండలి సభ్యుడిగా అవకాశం కల్పించినందుకు ఆయనకు కృతజ్ఞతలు చెప్పానన్నారు. తెదేపా ఆవిర్భావం నుంచి సేవలందించానని తెలిపారు. ఇప్పుడు రాజకీయాలు ఖరీదైనవిగా మారిపోయాయని, ప్రజాస్వామ్యానికి ఇది మంచి పరిణామం కాదని ఆయన అభిప్రాయపడ్డారు.

## Spoken English -1

Basic English Conversation

We would like to share with you the Basic English conversations. The topics level for English beginners. If you are a newbie in learning English, they are suitable for you

Lesson 1: WHERE ARE YOU FROM?

Hello. హలో

Hi. హయ్

How are you ? -ఎలా వున్నారు?

I'm good. How are you?

Good. Do you speak English ? మంచిది నీకు ఇంగ్లీష్ మాట్లాడడం వచ్చా

A little. Are you American ? కొంచెం వచ్చు మీరు అమెరికన్ దేశస్థుల

Yes. అవును.

Where are you from ? మీరు ఎక్కడ నుండి వచ్చారు

I'm from California. నేను కాలిఫోర్నియా నుండి వచ్చాను

Nice to meet you. మిమ్మల్ని కలవడం సంతోషం

Nice to meet you too.

Lesson 2: DO YOU SPEAK ENGLISH?

Excuse me, are you American? క్షమించండి మీరు అమెరికన్ దేశస్తులా?

No. లేదు

Do you speak English? మీరు ఇంగ్లీష్ మాట్లాడుతారా?

A little, but not very well. కొంచెం. ఎక్కువ కాదు

How long have you been here? మీరు ఎంత కాలం నుండి ఇక్కడ ఉంటున్నారు

2 months. రెండు నెలల నుంచి

What do you do for work? ఏ పని చేస్తున్నారు?

I'm a student. How about you? నేను విద్యార్థిని. మీ గురించి చెప్పండి

I'm a student too. నేను కూడా విద్యార్థినే

By Dr.P.V.Ram

# రేపు శ్రీ లహరి కృష్ణ అమృత్ గీతాయన్ ఆల్బమ్ విడుదల

## పోస్టర్ ఆవిష్కరించిన మనుజ్యోతి ఆశ్రమం ప్రతినిధులు



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):- మనుజ్యోతి ఆశ్రమం వారి "ఓంకార్ స్వరూప్ శ్రీ లహరి కృష్ణ అమృత్ గీతాయన్" హిందీ ఆడియో ఆల్బమ్ ఆదివారం గురజాడ కళాక్షేత్రంలో విడుదల చేయనున్నట్లు మనుజ్యోతి ప్రతినిధి నరవ ప్రకాష్ రావు తెలిపారు. వైజాగ్ జర్నలిస్టు ఫోరం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ను, ఇన్విటేషన్ ను ఆశ్రమ నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆశ్రమ ప్రతినిధులు ఎస్ఎన్ ప్రసాద్,అప్పారావులు మీడియాతో మాట్లాడారు.

75 ఏళ్లుగా ఒకే దేవుడు, ఒకే దేశము, ఒకే కుటుంబం సిద్ధాంతమును ఆచరిస్తూ మనుజ్యోతి ఆశ్రమం ప్రపంచమంతట దేశీయ సమైక్యత సమావేశాలు నిర్వహించిందని తెలిపారు. దీనిలో భాగంగానే విశాఖ గురజాడ కళాక్షేత్రంలో ఆడియో ఆల్బమ్ విడుదలను ఏర్పాటు చేశామన్నారు. దేవాశీర్ లారి ప్రొడక్షన్ వారి "ఓంకార్ స్వరూప్ శ్రీ లహరి కృష్ణ అమృత్ గీతాయన్ " అను హిందీ ఆధ్యాత్మిక పాటల ఆల్బమ్ విడుదల కార్యక్రమం వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఈ ఆధ్యాత్మిక పాటలు భగవంతుని గురించి జ్ఞానాన్ని తెలుసుకొనుటకు, నేటి నవీన సముదాయమునకు ఉపయోగకరంగా ఉంటుందని వెల్లడించారు. ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ వి బాల మోహన్ దాస్ అధ్యక్షతన జరగనున్న ఈ విడుదల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ గజల్ శ్రీనివాస్, రిటైర్డ్ డిజిపి సిక్కిం అత్తిలి సుధాకర్, శివానంద ఆశ్రమ స్వామి విష్ణు దేవానంద సరస్వతి, మధ్యప్రదేశ్ కు చెందిన కెప్టెన్ శ్యాంసుందర్ త్రిపాఠి, తదితర ప్రముఖులు హాజరవుతారని వెల్లడించారు. ఆశ్రమ అధ్యక్షులు ఉపాజ్ నవరాజ ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో ఆశ్రమ ప్రతినిధులు దేవ ఇంద్రన్, జయప్రకాష్ బాలచందర్, పైడ్రాజు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జరిగిన విజ్ఞాన భారతి పాఠశాల వార్షికోత్సవ వేడుకలు



చింతపల్లి, (విశాఖ సమాచారమ్):- గ్రామంలోని విజ్ఞాన భారతి యూ పీ పాఠశాలలో 13వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.పాఠశాల ప్రిన్సిపాల్ జి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా విశాఖపట్నం నుంచి వి.కృష్ణమోహన్, చింతపల్లి మండల విద్యాశాఖాధికారులు, పనసల ప్రసాదు , బోడమనాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువు పట్ల ఏకాగ్రత, ఆసక్తి కలిగి ఉండాలన్నారు.అప్పుడే పై తరగతులకు వెళ్లే అవకాశం ఉంటుందనీ వారు అన్నారు. అలాగే విద్యార్థులు ఎల్లప్పుడూ క్రమశిక్షణ కలిగి ఉండే లా ఉపాధ్యాయులు వారికి విద్య బోధనను అందించాలని అన్నారు. అలాగే వారిలో ఉన్న క్రీడా నైపుణ్యతను కూడా వెలికి తీసేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ నేపథ్యంలో తమ సలహాలు సూచనలు తో పాటు పాఠశాల అభ్యున్నతికి మా వంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందని వారు అన్నారు.....అలాగే పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు సహకారం కూడా ఎంతో అవసరమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మెరుగైన విద్యాబోధన అందించడమే తమ పాఠశాల లక్ష్యమని, ఆయన అన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన విద్యార్థుల తల్లిదండ్రులు అధిక సంఖ్యలో విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించేందుకు సహకరించారని అన్నారు.అలాగే పాఠశాల అన్ని రంగాల్లో ముందుకు వెళ్ళేందుకు ఉపాధ్యాయుల సహాయ సహకారాలు కూడా సంపూర్ణంగా లభించాయన్నారు..

ఇందులో భాగంగా విద్యార్థులు అనేక వ్యాయామములు, విలువిద్య, సాంస్కృతిక కార్యక్రమాలు, దేశభక్తి గీతాలు వంటివి విద్యార్థులకు ఉపాధ్యాయులు అందించడం ఆనందదాయకంగా ఉందన్నారు.. అలాగే బి వి కే అనుబంధ విద్యా సంస్థ అయిన విజ్ఞాన భారతి పాఠశాలలను ఏజెన్సీ ప్రాంతాల్లో ఏర్పాటుచేసి , విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఇతర ప్రముఖులు హాజరయ్యారు.. ఈ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకర్షించాయి.

# పవన్‌ను గెలిపించామని ఎవరైనా అనుకుంటే అది వారి భ్రమ

## జనసేన ఆవిర్భావ సభలో నాగబాబు సంచలన వ్యాఖ్యలు



పిఠాపురం, (విశాఖ సమాచారమ్):- జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను పిఠాపురంలో ఎవరైనా గెలిపించామని అనుకుంటే వారి కర్మ అని ఆ పార్టీ నేత నాగబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. పిఠాపురం జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ, ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పిఠాపురంలో పవన్ కల్యాణ్ గెలుపులో రెండు నిజాలు ఉన్నాయన్నారు. ఒకటి పవన్ కల్యాణ్ అయితే రెండోది పిఠాపురం జనసైనికులు, ఓటర్లు అని వ్యాఖ్యానించారు. అలా కాదని పవన్ కల్యాణ్ గెలుపునకు తామే కారణమని తమలో ఎవరైనా అనుకుంటే చేయగలిగినది ఏమీ లేదని నాగబాబు చెప్పారు.

మరో నాలుగేళ్లలో అధికారంలోకి వస్తామంటున్న జగన్ వ్యాఖ్యలపై నాగాబాబు విమర్శలు కురిపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతోందని, మరో నాలుగేళ్లు కళ్లు మూసుకుంటే ఎన్నికలు వస్తాయని, అప్పుడు తామే అధికారంలోకి వస్తామంటున్న జగన్‌కు నాగబాబు కీలక సలహా ఇచ్చారు. వైసీపీ అధినేత జగన్ మళ్లీ అధికారంలోకి రావడమనేది జరిగేపనికాదన్నారు. "మీరు నిద్రలోనే ఉండండి.. అప్పుడప్పుడు కలవరించండి. 20,30 ఏళ్ల తర్వాత కలలో నుంచి బయటకు రండి. 20 ఏళ్ల తర్వాత మేల్కోండి.. ఆ తర్వాత మీ ఇష్టం." అని నాగబాబు తెలిపారు.

### ప్రైవేటు పాఠశాలల్లో 1,24,955 మంది ఉపాధ్యాయులు

అమరావతి, (విశాఖ సమాచారమ్):- రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల్లో మొత్తం 1,24,955 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల వివరాలు, వారికి ఏ మార్గదర్శకాల ప్రకారం జీతాలు చెల్లిస్తున్నారు, ప్రైవేటు ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై శాసనమండలిలో కే.ఎస్ లక్ష్మణ రావు, ఇల్లా వెంకటేశ్వరరావు, బొర్రా గోపిమూర్తి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. 01-01-1994 తేదీన విద్యాశాఖ జారీచేసిన జీవో నెం.1 ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల వేతనాలు వర్తిస్తాయని, జీవోలోని నిబంధనలు అమలుచేయాలని సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేయడం జరిగిందని మంత్రి వివరించారు.

# వసతిగృహ అధికారికి సన్మానం



కొవ్వూరు, (విశాఖ సమాచారమ్):- కొవ్వూరు సహాయ సాంఘీక సంక్షేమ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర సంక్షేమాధికారుల సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా స్థానిక కొవ్వూరు ఎస్సీ సంక్షేమ వసతి గృహ అధికారి ముప్పిడి.రాజును సాంఘీక సంక్షేమ ఉద్యోగులు, అరుంధతీ ఉపాధ్యాయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహాయ సాంఘీక సంక్షేమ అధికారిణి మేరి మాత, హెచ్‌డబ్ల్యూఓ శ్రీలత, విశ్రాంత సహాయ సాంఘీక సంక్షేమ అధికారులు తీగిరిపల్లి సాల్మన్ రాజు, గెడ్డం శంకర్రావు, రిటైర్డ్ సాంఘీక సంక్షేమ అధికారుల సంఘం నాయకులు పెనుమాక జయరాజు, రిటైర్డ్ హెడ్మాస్టర్ సనమండ్ర కాంతారావు, అడ్వకేట్ తీగిరిపల్లి. రవికుమార్, రిటైర్డ్ జిల్లా జడ్జి కె. భీష్మ గాంఘేయుడు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో రైతు బజార్లు, మార్కెట్ కమిటీల ఆకస్మిక తనిఖీ



విజయనగరం, (విశాఖ సమాచారమ్):- లివ్యవసాయ మార్కెటింగ్ శాఖ సంచాలకులు విజయ సునీత శుక్రవారం విజయనగరం పట్టణంలోని మూడు రైతు బజార్లు మరియు మార్కెట్ కమిటీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా, మార్కెటింగ్ శాఖ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించి, మార్కెట్లలో వ్యవస్థాపిత సదుపాయాలను పరిశీలించారు.

ఈ తనిఖీల్లో భాగంగా, రైతులకు అందుతున్న సౌకర్యాలు, కూరగాయల ధరలు, మార్కెట్ కమిటీల విధానం గురించి అధికారులతో చర్చించారు. మార్కెట్ ప్రాంతాలలో పరిశుభ్రత, డ్వాక్రా షాపులు, విక్రయించే ఉత్పత్తుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ పి. సుధాకర్, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కిరణ్, జిల్లా వ్యవసాయ వాణిజ్య మరియు మార్కెటింగ్ అధికారి (డాట్మో) బి. రవి కిరణ్ గార్లతో పాటు మార్కెటింగ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ, ఈ.ఈ, డి.ఈ పాల్గొన్నారు.

# విద్య, ఉద్యోగ సమాచారం

## ఆర్మీ రిక్రూటింగ్

**గుంటూరు:** ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్, గుంటూరు ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలకు చెందిన అభ్యర్థుల కోసం అగ్నివీర్ సిబ్బంది నియామకాలు 2025-26 నమోదును ప్రారంభించింది.

వివిధ కేటగిరీల అగ్నివీర్ల నియామకం కోసం www.joinindianarmy.nic.in ద్వారా నమోదు చేసుకోవచ్చు. నమోదుకు చివరి తేదీ 10 ఏప్రిల్ 2025. ఒక అభ్యర్థి ఇప్పుడు రెండు వేర్వేరు అగ్నివీర్ కేటగిరీలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సీఈఈ) మొట్టమొదటిసారిగా తెలుగుతో సహా 13 వేర్వేరు భాషల్లో నిర్వహించబడుతోంది. అన్ని కేటగిరీలకు సంబంధించిన ఎన్‌సీసీ 'ఎ', 'బి' & 'సి' సర్టిఫికెట్ కలిగిన వారికి మరియు ప్రతిభావంతులైన క్రీడాకారులకు, అలాగే అగ్నివీర్ టెక్నికల్ కేటగిరీ కోసం ఐటిఐ/డిప్లొమా అర్హత కలిగిన అభ్యర్థులకు అదనపు మార్కులు కూడా ఇవ్వబడతాయి.

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురము, వైఎస్ఆర్ కడప, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పలనాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య మరియు శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన ఆసక్తిగల అభ్యర్థులందరూ అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ కార్యాలయ సహాయకులు/స్టోర్ కీపర్ టెక్నికల్ మరియు అగ్నివీర్ వృత్తి నిపుణుల పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

నియామక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఉంటుంది. కావున, అగ్నివీర్‌గా సైన్యంలో నియామకం కోసం దళారులకు డబ్బులు చెల్లించవద్దు.

## రామగుండం ఫెర్టిలైజర్స్, కెమికల్స్ లిమిటెడ్‌లో ఖాళీలు



రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెషనల్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఆసక్తి గల అభ్యర్థులు ఏప్రిల్ 10వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

**విభాగాలు:** కెమికల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఇనుస్ట్రుమెంటేషన్, మెటీరియల్స్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, సివిల్, మెడికల్, సేఫ్టీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ

పోస్టు పేరు-ఖాళీలు

1. ఇంజినీర్: 14
2. సీనియర్ మేనేజర్: 04
3. చీఫ్ మేనేజర్: 07
4. డిప్యూటీ జనరల్ మేనేజర్: 03
5. మేనేజర్: 02
6. డిప్యూటీ మేనేజర్: 01
7. అసిస్టెంట్ మేనేజర్: 03
8. మేడికల్ ఆఫీసర్: 01
9. సీనియర్ మెడికల్ ఆఫీసర్: 01
10. డిప్యూటీ సీనియర్ మెడికల్ ఆఫీసర్: 01
11. అడిషనల్ సీనియర్ మెడికల్ ఆఫీసర్: 01
12. సీనియర్ మెడికల్ ఆఫీసర్: 01

మొత్తం ఖాళీల సంఖ్య: 40

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్(కెమికల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, డిప్లొమా, సీఏ, సీఎంఏ,, ఎంబీఏ, సివిల్), ఎంబీబీఎస్, బీఎస్సీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: ఇంజినీర్‌కు 30 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్, సీనియర్ మెడికల్ ఆఫీసర్, డిప్యూటీ సీనియర్ మెడికల్ ఆఫీసర్, అసిస్టెంట్ మేనేజర్‌కు 40 ఏళ్లు, అడిషనల్ సీనియర్ మెడికల్ ఆఫీసర్, సీనియర్ మెడికల్ ఆఫీసర్, మేనేజర్, సీనియర్ మేనేజర్‌కు 45 ఏళ్లు, చీఫ్ మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు 50 ఏళ్లు నిండి ఉండాలి.

జీతం: నెలకు పోస్ట్ కోడ్ ఈ-1కు రూ.40,000 - రూ.1,40,000, ఈ-2కు రూ.50,000 - రూ.1,60,000, ఈ-3కు రూ.60,000 - రూ.1,80,000, ఈ-4కు రూ.70,000 - రూ.2,00,000, ఈ-5కు రూ.80,000 - రూ.2,20,000, ఈ-6కు రూ. 90,000 - రూ.2,40,000, ఈ-7కు రూ.1,00,000 - రూ.2,60,000.

దరఖాస్తు ప్రక్రియ: ఆన్‌లైన్ ద్వారా.

దరఖాస్తు ప్రక్రియ: ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తుకు చివరి తేదీ: 10-04-2025.

## బీఈఎల్‌లో ఫ్యాకల్టీ, నాన్ ఫ్యాకల్టీ పోస్టులు



ప్రభుత్వ రక్షణ రంగ సంస్థ, నవరత్న హోదా కలిగిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ బెంగళూరు ఫ్యాకల్టీ అండ్ నాన్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది. ఏప్రిల్ 1వ తేదీ వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్టు పేరు-ఖాళీలు

టీచింగ్ అండ్ నాన్‌టీచింగ్: 57

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీసీఏ, బీఈడీ, బీఎస్సీ, డిప్లొమా, బీ.ఎల్.ఐబీ, సీఏ, ఐసీడబ్ల్యూఏ, ఎంఏ, ఎంకామ్, ఎంఎస్సీ, ఎంసీఏ, ఎంఫిల్, పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 45ఏళ్లు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

జీతం: నెలకు ల్యాబ్ అసిస్టెంట్, ఆఫీస్ అసిస్టెంట్‌కు రూ.16,270, పీఈటీ, పీఆర్‌టీ, మ్యూసిక్, ఆర్ట్, డాన్స్ టీచర్‌కు రూ.21,250, టీజీటీ, జీపీటీ పోస్టులకు రూ.26,250, పీజీటీ పోస్టులకు రూ.27,500.

దరఖాస్తు ప్రక్రియ: ఆఫ్‌లైన్ ద్వారా

చిరునామా: ది సెక్రటరీ-బీఈఈఐ బెల్ హైస్కూల్ బిల్డింగ్, జలహళ్లిపోస్ట్, బెంగళూరు-560013.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తుకు చివరి తేదీ: 01-04-2025.

విశాఖ సమాచారమ్
శనివారం 15-3-2025

## పాక్‌లో వివక్ష

పాకిస్తాన్‌లో మైనారిటీ వర్గంగా ఉన్న హిందువులపై తీవ్ర స్థాయిలో వివక్ష ఉంటుందనే విషయం అందరికీ తెలిసిందే. అయితే అక్కడ ఉన్నత స్థాయిలో ఉంటూ ఆ దేశ కీర్తిప్రతిష్టల్లో భాగస్వామ్యులయ్యే హిందువులు సైతం అందుకు మినహాయింపుకాదని మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా వ్యాఖ్యలను బట్టితెలుస్తోంది. గతంలో పాకిస్తాన్ తరఫున 61 టెస్టులు ఆడి.. ఎన్నో విజయాల్లో కీలక పాత్ర పోషించిన కనేరియా హిందువుగా ఆ దేశంలో ఉండలేక అమెరికాలో నివసిస్తున్నాడు. తాజాగా వాషింగ్టన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ "మనమంతా ఇక్కడ కలుసుకున్నందుకు ఆనందంగా ఉంది. పాకిస్తాన్‌లో ఎదుర్కొన్న అనుభవాలను పంచుకోవడం బాగుంది. అక్కడ చాలా వివక్షను ఎదుర్కొన్నాం. ఇప్పుడు మన గళం విప్పుతున్నాం. నేను కూడా పాక్‌లో చాలాసార్లు వివక్షను అనుభవించా. నా కెరీర్ నాశనం అయింది. నాకు తగినట్లుగా గౌరవం పొందలేకపోయా. కారణం పాక్‌లో మైనారిటీలం కావడమే. ఇప్పుడు నేను అమెరికాలో ఉన్నా. మనం పాక్‌లో అనుభవించిన కష్టాలు ఎలాంటివో అమెరికాకు తెలియాలి. అప్పుడే ఏదో ఒక చర్యలు తీసుకోనేందుకు ఆస్కారముంటుంది" అని వెల్లడిరచాడు. షాహిద్ అఫ్రిది సారథిగా ఉన్నప్పుడు తనను మతం మారమని తరచూ ఒత్తిడి చేసేవాడని తెలిపాడు. " పాక్ కోసం నాణ్యమైన ఆటతీరు ప్రదర్శించా. నాకు మద్దతుగా నిలిచిన ఏకైక కెప్టెన్ ఇంజమామ్ ఉల్ హక్ మాత్రమే. షోయబ్ అక్తర్, షాహిద్ అఫ్రిది సహా ఇతర ప్లేయర్లలో కొందరు తీవ్రంగా ఇబ్బంది పెట్టేవారు. కనీసం నాతో కలిసి తినేవాళ్లూ కాదు. షాహిద్ అఫ్రిది అందరికంటే ఎక్కువగా నన్ను మతం మారమని ఒత్తిడి చేసేవాడు. చాలాసార్లు అడుగుతూనే ఉండేవాడు.. నేను పాకిస్తాన్‌లోనే ఉండి ఉంటే ఈ వాస్తవాలు చెప్పే స్వేచ్ఛ కూడా ఉండేదికాదు. అమెరికాలో ఉన్నాను కాబట్టి పాక్‌లో తాను ఎదుర్కొన్న వివక్ష, ఇబ్బందులపై మాట్లాడే అవకాశం దక్కింది" అని కనేరియా ఆవేదనాభరింతంగా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. దీంతో పాక్‌లో హిందువులపై వివక్ష అంశం మరో సారి తెరపైకి వచ్చింది.

పాకిస్తాన్ మతం ఆధారంగా భారత్ నుంచి విడిపోయి ఇస్లామిక్ రిపబ్లిక్‌గా మారిన విషయం తెలిసిందే. ప్రసుతం కేవలం 1-2శాతం మంది హిందువులు ఉన్నారు. పాకిస్తాన్ విభజన సమయంలో 20 శాతం వరకు ఉన్న హిందువులు, అణిచివేత కారణంగా కేవలం సింగిల్ డిజిట్‌కి పరిమితమయ్యారు. హిందువులపై అఘాయిత్యాలు, కిడ్నాప్‌లు పాకిస్తాన్ వ్యాప్తంగా జరుగుతూనే ఉంటాయి. బాలికలు, మహిళల్ని బలవంతంగా అపహరించి, మతం మార్చి, పెళ్లి చేసుకుంటున్న ఘటనలు చాలానే ఉన్నాయి. పాకిస్తాన్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ 2023 జనాభా లెక్కల ప్రకారం, 2023 సంవత్సరంలో పాకిస్తాన్ మొత్తం జనాభా దాదాపు 24,04,58 ,089. ఈ మొత్తం జనాభాలో ముస్లింల వాటా దాదాపు 96.35 శాతం. ఆ లెక్కల ప్రకారం హిందువుల జనాభా కేవలం 1.61 శాతం మాత్రమే. అక్కడ చాలా నగరాల్లో వందశాతం ముస్లింలే ఉన్నారు. ఒక్క 'మిఠీ' నగరంలో మాత్రం హిందువుల ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది. అక్కడ 80 శాతం హిందూ జనాభా ఉంది. పాకిస్తాన్‌లో పంజాబ్ ప్రావిన్సులోని థార్‌పార్కర్ జిల్లాలో ఉంది. ఇది జిల్లా హెడ్‌క్వార్టర్. పూర్తిగా ఎడారి ప్రాంతంలోని మట్టిదిబ్బల మధ్య నగరం నెలకొని ఉంది. కరాచీ నుంచి దాదాపుగా 5-6 గంటల దూరంలో ఈ మిఠి నగరం ఉంది. భారత్ సరిహద్దుకు దగ్గరగా ఉంటుంది. పాకిస్తాన్‌లో అన్ని ప్రాంతాల్లో ముస్లింల ఆధిపత్యమే ఉండగా మిఠిలో మాత్రం హిందువుల రాజ్యమే నడుస్తోంది. ఈ నగరంలో ప్రతి వీధిలో ఆలయం ఉంటుంది. ప్రతీ ఇంటిపై జైశ్రీరాం వంటి నినాదాలు కనిపిస్తుంటాయి. దీపావళి, హోలీ లాంటి పండగలు ఘనంగా జరుపుకుంటారు. మిఠీలో చాలా వరకు వ్యాపారం, దుకాణాలు హిందువుల చేతుల్లోనే ఉంటాయి. ఈ ఒక్క ప్రాంతంలోనే పశువధపై నిషేధం ఉంది. ప్రతీ హిందూ కుటుంబం కూడా ఆవుల్ని పెంచుకుంటుంది. వీధుల్లో ఆవులు, పశువులు స్వేచ్ఛగా తిరుగుతుండటం చూడొచ్చు. ఇక్కడ నివసించే ముస్లింలు కూడా గోమాంసం తినరు. ఇరువర్గాలు కూడా కలిసి మెలిసి ఉంటాయి.

పంచాంగం

శనివారం 15-3-2025
క్రోధి నామ సంవత్సరము
ఉత్తరాణాయణం, శిశిరరుతువు
ఫాల్గుణ మాసం

| | |
|---|---|
| తిథి | : బ. పాడ్యమి ప. 2.34 |
| నక్షత్రం | : ఉత్తర ఫాల్గుణి ప. 8.54 |
| వర్జ్యం | : సా. 6.18 ల 8.06 |

## మీ కలాన్ని సంధించండి

కథలు, కవితలు, సాహిత్య, రాజకీయ విశ్లేషణలు, వ్యాసాలు, ప్రత్యేక కథనాలు, సందర్భోచిత కథనాలు... ఇలా ఏదైనా సరే.. రాసే ఆసక్తి ఉన్న వారు పంపవచ్చు. మీకు 'విశాఖ సమాచారమ్' దినపత్రిక చక్కటి వేదికగా నిలుస్తుంది. బాగున్న రచనలను మీ పేరు , ఫొటోతో సహ ప్రచురిస్తాము.

**మీ రచనలు పంపించవలసిన ఈమెయిల్ అడ్రస్**
**vspnews4@gmail.com**
**వాట్సాప్ నంబర్ : 9100986585.**

# మోసాల మార్కెట్లో వినియోగదారుడు!

## నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

**జా**తిపిత చెప్పినట్లు కొనుగోలుదారుడే అందరికీ మూలం. అతన్ని గౌరవించి, అతని హక్కులను కాపాడటం మన బాధ్యత. ఏటా మార్చి 15న ప్రపంచ వినియోగదారుల హక్కుల పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించి వినియోగదారుల్లో చైతన్యం నింపే కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ భూమిపై పుట్టిన ప్రతి వ్యక్తి వినియోగదారుడే. జగమంతా విస్తరించి ఉన్న వినియోగదారులు ఉచిత, ఆర్థిక వస్తువులను, సేవలను వినియోగిస్తూ దేశాల ఆర్థిక వ్యవస్థలు నడవడానికి ఇంధనమవుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా వినియోగదారుల హక్కులకై ఉద్యమిస్తున్న 'కన్స్యూమర్ ఇంటర్నెషనల్ అనే సంస్థ 1983 మార్చి 15 నుండి ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. 1962లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నడ తొలిసారి వినియోగదారుల హక్కులపై ఒక బిల్లును కాంగ్రెస్‌లో సమర్పించిన రోజు మార్చి15. ఏప్రిల్ 9,1985 ఐక్య రాజ్యసమితి, వినియోగదారుల హక్కులపై సాధారణ నియమావళిని రూపొందించింది. వస్తు సేవలను ధర చెల్లించి కొనుగోలు చేసే వినియోగదారులకు భద్రత, సమాచారం, ఎంపిక, ప్రాతినిధ్యం, కనీస అవసరాలు తీర్చుకోవడం, నష్టపరిహారం, చైతన్యం, వినియోగవిద్య, ఆరోగ్యకర వాతావరణం తదితర హక్కులున్నాయని, ఈ నియమావళి పేర్కొంటోంది. 120 దేశాలలో 250 సంస్థలలో కలిసి పనిచేస్తున్న కన్స్యూమర్ ఇంటర్నేషనల్ ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేలా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. మనదేశంలో ఏటా డిసెంబర్ 24న జాతీయ వినియోగదారుల దినోత్సవం పాటిస్తున్నారు. 1986 నాటి వినియోగదారుల పరి రక్షణ చట్టం అమలులోకి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకొని ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వినియోగదారుల హక్కులపై మాగ్నాకార్టాగా పేరుగాంచిన ఈ చట్టం కొనుగోలుదారుల ప్రయోజనాలను కాపాడటం, వివిధ రకాల దోపిడీలు, అక్రమ వ్యాపారాల నుండి రక్షించడం, హక్కుల పరిరక్షణ, సమస్యలను విని పరిష్కరించే యంత్రాంగం ఏర్పాటు వంటి నిబంధనలు ఏర్పరిచింది.




వినియోగదారునికి ఆరు రకాల హక్కులను ప్రసాదిస్తున్న ఈ చట్టం ప్రభుత్వ, ప్రైవేట్, సహకార రంగాలలో జరిగే వస్తు, సేవల విక్రయాలకు వర్తిస్తుంది. వినియోగదారులకు నష్టపరిహారంతోపాటు, అక్రమ వ్యాపార నిరోధక, నివారక చర్యలు తీసుకుంటుంది. చట్టం ప్రకారం జిల్లాస్థాయి ఫోరం (20లక్షల వరకు నష్టపరిహారం) రాష్ట్ర కమిషన్ (1 కోటి వరకు నష్టపరిహారం) జాతీయ కమిషన్ (1 కోటి పైన నష్టపరిహారం)లు ఏర్పడి వినియోగదారుల సమస్యలను పరిష్క రిస్తున్నాయి. ఫిర్యాదు రుసుం లేకపోవడమేకాక, అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉంది. మండలస్థాయిలలో వినియోగదారుల పరిరక్షణ మండళ్లు, హక్కుల పరిరక్షణ, సలహాలు ఇస్తున్నాయి. జాతీయ హెల్ప్‌లైన్ 1800- 11-4000 లేదా 14404ల ద్వారా సత్వరమే వివాదాల పరిష్కార సలహాలు, సూచనలిస్తున్నారు. జాగో గ్రాహక్ జాగో (మేలుకో వినియోగదారుడా మేలుకో) వంటి ఉద్యమ ప్రచారం ద్వారా చైతన్యం కల్పిస్తున్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్, వినియోగదారుల చైతన్య పరిశోధక కేంద్రం (అహ్మదాబాద్) ముంబాయి గ్రాహక్ పంచాయతీ, లీగల్‌ఎయిడ్ సొసైటీ (కోల్‌కతా) అఖిల భారతీయ గ్రహక్ పంచాయత్ వంటి సంస్థల ద్వారా వినియోగదారుల హక్కుల పరిరక్షణకై కృషి జరుగుతోంది.

వస్తు మార్పిడి పద్ధతి నుండి ఆన్‌లైన్ కొనుగోళ్ల వరకు వివిధ రూపాల్లో క్రయవిక్రయాలు జరిగే మనదేశంలో సహజంగానే వినియోగదారులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. వస్తు, సేవల సమాచారం అందించకపోవడం, సరఫరాదారుల మోసాలు, తప్పుడు తూకాలు, కొలతలు,విక్రయ అనంతర సేవా లోపాలు, నకిలీ వస్తువుల బెడద, స్వచ్ఛత, నాణ్యత, సరైన పరిమాణం, లేని వస్తువుల సరఫరా డెలివరీలో లోపం, తప్పుడు ప్రచారం, డబ్బుకు తగిన ప్రతిఫలం లేని వస్తువులను అంటగట్టడం, ఆరోగ్యభద్రతా సమస్యలు, అధిక ధరలు, ఆన్‌లైన్ మోసాలు, సకాలంలో రిటర్న్, రీఫండ్ చేయకపోవడం, సేవకు మించిన బిల్లులు, తప్పుడు బిల్లులు వేయడం, వీపీపీ ద్వారా మోసాలు, పన్నులు చెల్లించని అన్ బ్రాండెడ్ వస్తువులను అమ్మటం, నిషేధిత ఆహార రంగుల పదార్థాలు అమ్మ టం, సేవాలోపాలు, తదితర అనేక సమస్యలు వినియోగదారులను కష్టాల పాల్జేస్తున్నాయి. ఆన్‌లైన్ కొనుగోళ్లు బాగా పెరిగిపోవడంతో మోసాలు కూడా పెరిగాయి.

ఇంటర్నెట్ కొత్త వాణిజ్య మోసాలకు తెర తీసింది. ఈ మోసాల నుండి వినియోగదారులను రక్షించడం నేడు సరికొత్త సవాలు. నిరక్షరాస్యులు అధికంగా ఉన్న మనదేశంలో ఆర్థిక అక్షరాస్యత, వినియోగ విద్యగలవారు పెరిగితేనే మోసాలకు అడ్డుకట్ట వేయగలం. జాతీయ, అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవాలు నిర్వహించడం ద్వారా అక్రమాలకు అడ్డుకట్టవేయడం, వినియోగ పరిజ్ఞానాన్ని ప్రచారం చేయడం, బులిటెన్‌లు, పీరియాడికల్స్, కరపత్రాలు, పోస్టర్ల ద్వారా ప్రచారం, నైతిక వ్యాపారాన్ని ప్రోత్సహించడం, వినియోగదారులు, వ్యాపారుల మధ్య సంబంధాలను పెంచడం, వస్తుసేవల నాణ్యత పెంచడం, వినియోగదారుల హక్కులపై వారిలో చైతన్యం పెంచడం, సామాజిక అవినీతిని అరికట్టడం, ప్రభుత్వాలను వ్యాపార వరాలను చైతన్యం చేయడం, వినియోగదారులకు న్యాయవేదికల గురించి తెలపడం, వినియోగమోసాలను ముద్రించి ప్రచారం చేయడం, నష్టపరిహారం పొందిన కేస్ స్టడీలను ప్రచారం చేయడం, మార్కెటింగ్ వ్యవస్థకు ఊతం ఇవ్వడం వంటి లక్ష్యాలు ఉన్నాయి. వినియోగదారుల్లో స్పృహ పెరగనిదే వారిని మార్కెట్ మోసాల బారి నుండి ఎవరూ రక్షించలేరు.

ఏదీ అసలు, ఏది నకిలీ, ఏవి స్వచ్ఛమైనవి, ఏవి బ్రాండెడ్, ఇలా వినియోగ విద్యపై పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశాలుగా చేర్చడం, పత్రికలు, ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయడం వినియోగదారుల ఫోరాలను పటిష్టం చేయడం, శిక్షలు కఠినతరం చేయడం, సైబర్ క్రైం, విభాగాలను పటిష్టం చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో జరిగే నకిలీ, చౌకరకపు వస్తుమోసాలను అరికట్టడం ప్రభుత్వ నిఘా యంత్రాన్ని పటిష్టం చేయడం వంటి చర్యల ద్వారా వినియోగదారున్ని మనం రక్షించవచ్చు.


సుగుణ శేఖర్ రెడ్డి గుమ్మళ్ల, ఫ్రీ లాన్స్ జర్నలిస్ట్

# భారత కోకిల సరోజినీ నాయుడు

**భా**రత కోకిలగా ప్రసిద్ధి చెందిన సరోజినీ నాయుడు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు. కవయిత్రి. భారత జాతీయ కాంగ్రెసు తొలి మహిళా అధ్యక్షురాలుగా ఎన్నికయిన సరోజినీ దేవి స్వతంత్ర భారత దేశపు తొలి మహిళా గవర్నరు కూడా కావడం విశేషం. సరోజినీ ఉర్దూ, తెలుగు, ఆంగ్లము, పర్షియన్, బెంగాలీ భాషలు మాట్లాడేవారు. ఈమెకు పీ.బీ.షెల్లీ కవిత్వం అంటే చాలా ఇష్టం. 1930లోలో ఉప్పు సత్యాగ్రహంలో మహాత్మాగాంధీతో పాటు పాల్గొన్న సరోజినీదేవి నిజాం పాలనలో అప్పటి హైదరాబాదులో స్త్రీల చదువుకు సరైన సౌకర్యాలు లేకపోవడం వలన ఆమె మద్రాసులో చదువుకున్నారు. 15 సంవత్సరాల వయసులో ఈమె దక్షిణాదికి చెందిన డా. ముత్యాల గోవిందరాజులు నాయుడును కలిసి ప్రేమించారు. చదువు పూర్తయిన తర్వాత ఆయనను కులాంతర వివాహము చేసుకున్నారు. కులాంతర వివాహాలకు సమాజం తీవ్ర వ్యతిరేకత చూపుతున్న ఆ రోజుల్లో సరోజినీ గోవిందరాజులు నాయుడును బ్రహ్మో వివాహ చట్టం ప్రకారం పెళ్ళి చేసుకోవడం సంచలనమైంది. వీరి వివాహాన్ని కందుకూరి వీరేశలింగం పంతులు జరిపించారు. ఆమె ఎన్నో గొప్ప గొప్ప కవితలు రాసారు.

సరోజినీ నాయుడు 1879 వ సంవత్సరంలో ఫిబ్రవరి 13వ తేదీన హైదరాబాదులో ఒక సాంప్రదాయ బెంగాలీ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆమె తండ్రి డా. అఘోరనాథ్ చటోపధ్యాయ. తల్లి వరద సుందరి. అఘోరనాథ్ చటోపాధ్యాయ నిజాం కాలేజీ తొలి ప్రధానోపాధ్యాయుడు. ఎనిమిది భాషలలో పండితుడు. ఎడింబరో విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందారు. తల్లి వరద సుందరి రచయిత్రి. ఆమె కావ్యాలు, కథలు రాశారు. స్వాతంత్ర్య సమరయోధురాలు, కవయిత్రి అయిన సరోజినీ నాయుడు భారతీయ మహిళలు ఏ రంగంలోనూ తీసిపోరని నిరూపించిన సాహస మహిళామణి.

చిన్నతనం నుంచే కార్యదీక్ష, పట్టుదల ఎక్కువగా ఉన్న సరోజినీనాయుడు పన్నెండేళ్ళ వయసులోనే మదరాసు విశ్వవిద్యాలయం మెట్రిక్ లేషన్ పూర్తి చేశారు. ఏది? ఏమిటి? ఎలా? ఎందుకు అనే ప్రశ్నించే తత్వంతో ఎదిగిన మహామేధావి సరోజినీ నాయుడు. ఆమె తన పదమూడో ఏట "లేడీ ఆఫ్ లేక్" అని ఆంగ్లంలో రాసినది చదివిన నిజాం నవాబు సరోజినిని వివిధ రంగాల్లో పరిశోధనలకోసం విద్యార్థి వేతనమిచ్చి ఇంగ్లండు పంపారు.

లండన్ కింగ్స్ కాలేజీలోను, కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయ అధ్వర్యంలోని గిర్టన్ కాలేజీలోనూ చదువుకున్న సరోజిని రాసిన కవితలను చదివి, ఇంగ్లండులోని ఆంగ్ల భాషా విమర్శకులు ఆమెను ఎంతగానో అభినందించారు. అక్కడి వారితో స్నేహ సంబంధాలు పెంచుకుని వారి సలహాలు, సూచనలతో ఇంగ్లీషులో ఎన్నో రచనలు చేసిన ఆమె కావ్యాలలో బర్డ్ ఆఫ్ ది టైం,ది గోల్డెన్ థ్రెషోల్డ్, ది బ్రోకెన్ వింగ్స్ అనేవి చాలా ప్రసిద్ధమైనవి. ఇంగ్లండులో ఉన్నప్పటికీ భారతీయ జీవితాలను ప్రతిబింబిస్తూ రచనలు చేస్తూ వచ్చిన ఆమె కులమతాలకు అతీతంగా ఆదర్శమూర్తిగా గోవిందరాజులు అనే వైద్యుడిని ప్రేమించి పెళ్ళి తేసుకున్న సరోజినీ నాయుడు హైదరాబాదు నివాస గృహమైన నాంపల్లి రైల్వే స్టేషనుకు సమీపంలో వున్న ఈ చారిత్రాత్మక భవంతి గోల్డెన్ త్రెషోల్డ్ వారి తండ్రి గార్జ్ఞపకార్థం జాతికి అంకితం చేశారు.

వివాహమై ఇద్దరు పిల్లలున్నప్పటికీ ఆమె కుటుంబ సంతోషం గురించి మాత్రమే ఆలోచించక మహిళాభివృద్ధికి ఎంతో కృషిచేసి 1906లో మహిళలకు విద్య అవసరమని దేశమంతా ఎన్నో మహిళా సమావేశాలు ఏర్పరచి మహిళల్లో చైతన్యం తీసుకురావడానికి పాటుపడ్డారు. కాంగ్రెస్ జాతీయ భావాలకు అనుగుణంగా నడుచుకుంటూ 1915లో బొంబాయిలో జరిగిన కాంగ్రెస్ మహా సభలకూ, 1916లో జరిగిన లక్నోలో జరిగిన కాంగ్రెస్ సభలలో ఆమె చురుకుగా పాల్గొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ స్వాతంత్రోద్యమ ఉపన్యాసాలిచ్చి శ్రోతల గుండెలను హత్తుకున్న సరోజిని నాయుడు ప్రభుత్వానికి ఎదురు తిరిగి తూటా దెబ్బలకో, చీకటి కొట్లకో బలయ్యే బదులు ఈ బానిస బ్రతుకే నయమనుకుని సర్దుకుపొయ్యే అమాయక ప్రజానీకంలో దేశభక్తిని నూరి పోసారు. చావుకు భయపడక ఉద్యమంలో పాల్గొనేలా చేశారు. 1919లో పంజాబ్ లోని జలియన్ వాలా బాగ్ దారుణ ఘటనకుఆమె గుండె చెరువైంది. నాటి దుర్ఘటనలో చనిపోయిన ప్రతి భారతీయుడి ఆర్తనాదాలు ఆమె చెవుల్లో గింగురుమన్నాయి. బాధిత కుటుంబాల శోకాలు తలుచుకొని ఆమె చలించిపోయారు. ఓవైపు ఆమె ఆరోగ్యం దెబ్బతిన్నప్పటికీ లెక్కచేయక రక్త పిపాసి అయిన పంజాబ్ గవర్నర్ జనరల్ డయ్యర్ మీద ఆందోళన లేవదీసారు. దీనిపై గాంధీజీకి ఉత్తరం రాశారు. డయ్యర్ వల్ల జరిగిన ఘోరాన్ని రాక్షస కృత్యాలను యావత్ ప్రపంచానికీ తెలిసేలా ఉద్యమించి ఆంగ్లేయులను భారత దేశం నుంచి తరిమి కొట్టాలని, భారతీయుల స్వేచ్ఛ చూడాలనుందని, అప్పుడే భరతమాత ఆత్మ శాంతిస్తుందని ఆమె లండనం నుంచి రాసిన ఈ లేఖలో తెలిపారు. లండన్ లో దేశ స్వాతంత్రం కోసం రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న ఆమె పురోగతినీ, స్వచ్ఛమైన స్వేచ్ఛాస్వాతంత్ర్య జీవితాలను ఆశించిన విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ లాగా స్త్రీయై ఉండి కూడా జాతి విమోచనానికి శాయశక్తులా అహోరాత్రులు కృషి చేసిన త్యాగమూర్తి సరోజినీ నాయుడు.



ఎందరో మహానుభావుల దేశభక్తి, ఎడతెగని ఉద్యమాలతో భారత దేశానికి 1947 ఆగస్టు 15 వ తేదీన మనం స్వాతంత్ర్యం లభించింది. సరోజినీ నాయుడు దేశానికి చేసిన సేవలు దృష్టిలో ఉంచుకుని ఆమెను ఉత్తర ప్రదేశ్ కు గవర్నర్ గా నియమించారు. ఆమె ఉత్తరప్రదేశ్ కు చేసిన సేవ, కార్యదక్షత చిరస్మరణీయం. రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక, సాహిత్య రంగాలలో అమూల్య సేవలుఅందించిన ఆమె తన 70వ ఏట 1949 మార్చి రెండో తేదీన లక్నోలో తుదిశ్వాసవిడిచారు. ఆమె జ్ఞాపకార్థం భారత ప్రభుత్వం 1964 ఫిబ్రవరి 13వ తేదీన ఒక తపాలబిళ్ళను విడుదల చేసింది. అలాగే ఆమెపై ఉన్న అభిమానంతో సికిందరాబాద్ పరిధిలో ఒక వీధికి సరోజినీ దేవి రోడ్డు అని నామకరణం చేశారు. ఆమె పేరున హైదరాబాదులో సరోజినీ కంటి ఆసుపత్రినికూడా స్థాపించారు. ఆమె విలువైన వస్తువులు ఇప్పటికీ హైదరాబాదులోని సాలార్ జంగ్ మ్యూజియంలోను, జాతీయ పురావస్తు ప్రదర్శనశాలలోను పదిలంగా ఉన్నాయి.

– యామిజాల జగదీశ్

# తగ్గుతున్న అమెరికా, కెనడా మోజు!

## రష్యాను ఎంచుకుంటున్న భారతీయ విద్యార్థులు

**భా**రతీయ విద్యార్థులకు అమెరికా,కెనడా విదేశీ విద్యమీద మోజు నెమ్మదిగా తగ్గుతున్నాయని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. అమెరికా,కెనడా,యుకె, ఆస్ట్రేలియా లకు ఉన్నత చదువుల కోసం భారతీయ విద్యార్థులు కొన్ని సంవత్సరాలుగా వెళ్లడం జరుగుతోంది. కెనడా ప్రభుత్వం భారత్ పట్ల వ్యతిరేకత, అమెరికాలో ట్రంప్ ఆంక్షలు,కఠినమైన వీసా నిబంధనలు,అధిక ఆర్థిక డిమాండ్లు, తిరస్కరణలు, దౌత్య సమస్యలు తదితర కారణాలు విదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నది.ఆయా దేశాల బదులు రష్యా, జర్మనీ, ఉజ్బెకిస్తాన్ లకు వెళ్లడం పెరిగింది.మొత్తం మీద విదేశాలకు వెళ్లే వారి సంఖ్య తగ్గుతున్నది.భారతీయ విశ్వవిద్యాలయాలలో పోటీ ఎక్కువ కావడం, విదేశాల్లో ప్రోత్సాహకాలతో పాటు విద్య అనంతరం మంచి ఉద్యోగం దొరుకుతుందనే ఆశతో విద్యార్థులు ఆయా దేశాల్లో విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారు. 2024లో విదేశాలకు వెళ్లే విద్యార్థుల సంఖ్య బాగా తగ్గింది. కెనడా వెళ్లేవారు 41 శాతం తగ్గడం విశేషం.బ్రిటన్ వెళ్లేవారి సంఖ్య 27 శాతం,అమెరికా వెళ్లే వారిసంఖ్య 13 శాతం తగ్గింది.2023లో8,92,989 భారతీయ విద్యార్థులు విదేశీ బాట పట్టగా,2024లో 7,59,064 కి తగ్గారు.అంటే సగటున 15 శాతం తగ్గింది.2024లో అమెరికా, కెనడా, బ్రిటన్ వెళ్లిన విద్యార్థుల సంఖ్య 27 శాతం పైగా తగ్గినట్లు దౌత్య వర్గాల బ్యూరో సమాచారం.

అమెరికాలో వీసా నిబంధనలు కఠినతరం,కెనడాలో సిక్కు వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ ప్రమేయం ఉందని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఆరోపించారు.2023 నుంచి పరిస్థితి దిగజారడం తో కెనడా వీసా నిబంధనలు,స్టూడెంట్ పర్మిట్ నిబంధనలు కఠినతరంతో అక్కడికి వచ్చే విద్యార్థులు సంఖ్య తగ్గింది.బ్రిటన్లో కూడా వచ్చే విద్యార్థులపై కొత్త నిబంధనలు తెచ్చింది.ఆస్ట్రేలియా వెళ్లేవారి సంఖ్య కూడా తగ్గుతున్నదని పార్లమెంటులో కేంద్రం విద్యాశాఖ మంత్రి ప్రకటించడం విశేషం.

2024లో 2023తోపోలిస్తేరష్యాను ఎంచుకున్న విద్యార్థుల సంఖ్య 34 శాతం పెరిగింది.2024లో 31 వేల మంది వెళ్ళారు.అలాగే జర్మనీ, ఉజ్బెకిస్తాన్ లకు దాదాపు 10,000 మంది చొప్పున వెళ్లారు.అలాగే ఫ్రాన్స్, న్యూజిలాండ్,ఫిలిఫీన్స్ పట్ల ఆసక్తి చూపుతున్నారు.అమెరికా అనాలోచిత నిర్ణయాలు,ట్రంప్ ఆంక్షలు వల్ల అమెరికా విశ్వవిద్యాలయాలకు ఈ ఏడాది భారీ నష్టం వాటిల్లే



అవకాశాలు ఉన్నాయి.రష్యాతో కొన్ని సంవత్సరాలుగా భారత్ కు ఉన్న పటిష్ట బంధంతో పాటు అక్కడి యూనివర్సిటీలు ఇచ్చే స్కాలర్ షిప్ లు విద్యార్థులను ఆకర్షించడం కూడా ప్రధాన కారణంగా ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి.కెనడాలో ప్రధాని మారడం,ఆయన భారత్తో సత్ సంబంధాలు నెరుపుతామని చెప్పడం కొంత ఆశ కలిగిస్తున్నది. ఏదిఏమైనా భవిష్యత్తులో భారతీయ విద్యార్థులకు ఉన్నతవిద్య కోసం ఎంచుకునే విషయంలో కొన్ని కష్టాలు తప్పకపోవచ్చు.కాని భారతీయ విద్యార్థులు ఎక్కడికి వెళ్లినా డెడికేషన్ తో చదివి విద్యను పూర్తి చేయడంలో నిష్ణాతులు కావడంవల్ల దేశాలుమారినావారిఆశయంలోమార్పురాదు.

యం.వి.రారావు, 8074129668

# ఉచిత అన్న ప్రసాద వితరణ



నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):- పాయకరావుపేట నియోజకవర్గం, నక్కపల్లి మండలం ఉపమాక శ్రీ కల్కి వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి విచ్చేయుచున్న భక్తులకు శుక్రవారం నక్కపల్లి విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నక్కపల్లి మండల లైన్ మ్యాన్ పులపర్తి వాసు చేతుల మీదుగా వచ్చిన భక్తులకు ఆహార పొట్లాలు మరియు మంచి నీరు పొట్లాలు అంధ చేశారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి విద్యుత్ శాఖ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

# కిల్లో లొలిత్ కు మెరుగైన వైద్యం అందించాలి

మిరియాల రైతులకు ప్రమాదం జరిగితే ఐటిడిఏ ఆర్థిక సాయం చేయాలి



అరకులోయ, (విశాఖ సమాచారమ్):- అరకు వేలి మండలం బస్కి పంచాయతీ దేవరపల్లి గ్రామానికి చెందిన కిల్లో లొలిత్ కాఫీ రైతు కి శుక్రవారం అరకు వేలి ఏరియా ఆసుపత్రిలో కిండంగి రామారావు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పరామర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరియాలు సేకరిస్తూ కాళ్ళు జారి చెట్టు నుండి కిందకి పడిపోవడంతో తలకి ఛాతికి బలమైన దెబ్బలు తగిలిందని ఇలాగే ఏజెన్సీలో అనేకమంది గిరి రైతులు మిరియాలు సేకరిస్తూ పడిపోయి కాళ్లు చేతులు విరిగిపోయిన పరిస్థితులు ఉన్నాయని. ఆయన అన్నారు కుటుంబ యజమాని కుంటివడైతే కుటుంబ పరిస్థితి దీనంగా ఉంటుంది. ఏజెన్సీలో ప్రధాన పంట అయిన కాఫీ ,మిర్యాలు పండిస్తూ జీవిస్తున్న గిరి జన కుటుంబాలకు ఎటువంటి భరోసా లేకుండా ఉన్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఆర్గానిక్ పంటగా అనేక లాభాలు ప్రభుత్వానికి ఉన్నప్పటికీ కాఫీ, మిర్యాలు రైతులకు ఇన్సూరెన్స్ బీమా వంటి పథకాలు లేకపోవడంతో ఈ రకమైన ప్రమాదం జరిగినప్పుడు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు ప్రభుత్వం తక్షణమే స్పందించి కాఫీ ,మిర్యాల రైతులకు ప్రమాదం జరిగినప్పుడు తక్షణ సాయం ప్రకటించి రైతులను ఆదుకోవాలని ఈ సందర్భంగా కిండంకి రామారావు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# ఇసుక లారీల దుమ్ము వల్ల ప్రజల ఇబ్బందులు



తాళ్లపూడి, (విశాఖ సమాచారమ్):- తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలంలోని ప్రభుత్వం మరియు అధికారులు ఎంత చెబుతున్నా ఇసుక మాఫియా ఆగడాలుకు ఇచ్చట ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారు.

ఇసుక లోడింగ్ చేసిన వెంటనే పట్టా కప్పకుండా నిర్లక్ష్యం వహిస్తే దాని ఫలితంగా ఇసుక లారీ రోడ్డు మీద నడుస్తుంటే వెనక వస్తున్న ద్విచక్ర మరియు ఇతర వాహనదారులు కళ్ళల్లో ఇసుకపడి చాలా ప్రమాదాలకు గురవుతున్నారు దీని కారణంగా చిన్న చిన్న యాక్సిడెంట్లకు జరుగుచున్నవి. రోడ్డు మలుపు టర్నింగ్ పాయింట్ దగ్గర ఇసుక పడడంతో చిన్న,చిన్న వాహనాల మీద ప్రయాణిస్తున్న ప్రయాణీకులు జారి పడిపోతున్నారు. ఇది అధికారులు నిర్లక్ష్యమా లేదా అధికారులు చెబుతున్న ఇసుక మాఫియా నిర్లక్ష్యమా? ప్రభుత్వం వెంటనే దీని మీద చర్యలు తీసుకోవాలి.

# డీఎస్సీ కోచింగ్ వెబ్ ఆప్షన్స్ నేడే ఆఖరి రోజు

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు విడుదల చేయబోయే మెగా డి.ఎస్.సి. పరీక్షకు కు హాజరు అయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించుటకు వెబ్ ఆప్షన్స్ అందుబాటులో ఉన్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ మరియు సాధికారిత అధికారి కె. రాజేశ్వరి తెలిపారు. డీఎస్సీ ఉచిత శిక్షణ కోసం ఎస్సీ ఎస్టీ వర్గాలకు చెందిన షార్ట్ లిస్టు చేయబడిన అభ్యర్థులు వారి ప్రాధాన్యత ప్రకారం కోచింగ్ సంస్థలు కేటాయించుటకు గాను వెబ్ ఆప్షన్స్ 15వ తేదీ వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వెబ్ ఆప్షన్స్ "సర్వీస్ జన్మభూమి", https://mdfc.apcfss.in వెబ్ పోర్టల్ లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కావున షార్ట్ లిస్ట్ చేయబడిన ఎస్సీ, ఎస్టీ డీఎస్సీ అభ్యర్థులు కోచింగ్ సెంటర్ ఎంచుకొనుటకు నేడే తమ ప్రాధాన్యతను నమోదు చేసుకోవాలని తెలిపారు.

# కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమి అక్రమంగా కబ్జా..!

● పత్రికల్లో వచ్చిన శీర్షికలపై రెవెన్యూ అధికారుల అరకొర స్పందన ● స్థానిక ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన పంచాయతీ టీడీపీ నేత ● ఎన్నికల కోడ్ చాటున ఇరుపకంచె ఏర్పాటు. ● పట్టించుకోకుండా చోద్యం చూస్తున్న అధికారులు ● ప్రభుత్వ బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్న వైనం... ● రెవెన్యూ సిబ్బందిపై ప్రజా సంఘాల ఆరోపణ ● ఆక్రమణల తొలగింపులో రెవెన్యూ శాఖ అధికారి జాప్యం




బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):- మండలంలోని తైపురం గ్రామపంచాయతీ పరిధిలో సర్వే నెంబర్లు 170, 171 జిరాయితీ భూములు ఉన్నాయని వాటిని అనుకొని సర్వే నెంబర్ 168 లో సుమారు 14 ఎకరాల భూమిలో గెడ్డ పోరంబోకు ఉండడంతో దానిని కబ్జా చేసి ఆ భూమి చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేసి దాని వంక ఎటువంటి అధికారులు చూడకుండా అమ్యామ్యాలు ముట్ట చెప్పారని పలు పత్రికలలో వచ్చిన కథనాలు స్పందించిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ బోర్డు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో అదే స్థలంలో ప్రభుత్వ భూమి అని బోర్డులు ఏర్పాటు చేసినట్టు స్థానిక వీఆర్ఓ కి తెలిపినప్పటికీ రెవెన్యూ అధికారులు నేడు అవేమీ పట్టనట్లు చూసి చూడకుండా వ్యవహరిం చడం పలు అనుమానాలకు తావిస్తోందని పత్రికలలో వచ్చిన కథనాల పట్ల స్పందించిన రెవెన్యూ సిబ్బంది ఆక్రమణకు గురైన స్థలంలో కాక పక్కన బోర్డులు ఏర్పాటు చేయడం తగదని ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన ఇనుపకంచే తొలగించాలని పలు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్న సందర్భంలో కేవలం చట్టం పేదల పై మాత్రమే ఉపయోగిస్తారని పెద్దలకు చుట్టం అని నిరూపించిన ఘటనలు స్పష్టంగా కనబడుతున్న తరుణంలో మండలంలోని రెవిన్యూ శాఖ అధికారులు మౌనం వహించడం తో అవినీతి ఎంత పెద్ద మొత్తంలో జరిగిందో అనే విధంగా పలు అనుమానాలకు బలం చేకూరుతుందని స్థానిక ప్రజా సంఘాల ఆరోపిస్తున్నాయి. తైపురం గ్రామపంచాయతీ 1 నాయకుడైన పల్లా చిన్న పలుదపాలుగా స్థానిక ఎమ్మెల్యేకు ఫిర్యాద నిరుపేదలకు దక్కాల్సిన భూమిని కబ్జా చేస్తున్నారని తెలిపినవ ప్రయోజనం లేదని వాపోతున్నారు. ఇదే అదునుగా సందడిలో గుట్టు చు కాకుండా కబ్జాదారులు ఎమ్మెల్సీ ఎన్నికలు కోడ్ చాటున ఆక్రమణ భూమి చుట్టూ ఇనుప ముళ్ల కంచె ఏర్పాటు చేసినప్పటికీ రె అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప అక్రమణల తొలగింపులో చ చేపట్టకుండా మౌనం వహించడం తగదని ఇలా అయితే మండల ప్రభుత్వ భూములకు రక్షణ కరువైందని ఇదే ధోరణి కొనసాగితే పేర భూములను కూడా అక్ర మించుకునే పరిస్థితి వస్తుందని భయాందోళనకు గురవుతున్నారు. ఇకనైనా సంబంధించిన శాఖ అధికా స్పందించి ఆక్రమణదారులపై చర్యలు చేపట్టి ప్రభుత్వ భూములు రక్షించి పలు ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. బోర్డుల ఏర్పాటేనా: ఆక్రమణదారులపై చర్యలు తీసుకోరా? పత్రిక వచ్చిన కథనాలపై స్పందించిన రెవెన్యూ అధికారులు కేవలం బోర్డ్ మాత్రమే ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారని దీనిపై సమగ్ర జరిపి సంబంధించిన స్థలం నుండి ఇనుపకంచే తొలగించాలని గ్రా డిమాండ్ చేస్తున్నారు.

# గోవాడ చక్కెర కర్మాగారం సమస్యలపై 21 న మహాధర్నా

రైతు, కార్మిక, ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం లో తీర్మానం



చోడవరం, (విశాఖ సమాచారమ్):- గోవాడ చక్కెర కర్మాగారం సమస్యలు పరిష్కారం చేయాలని ఈనెల 21 చక్కెర కర్మాగారం గేటు వద్ద మహ దర్నా చేపాట్టాలని, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, రైతు కూలీ సంఘం నాయకులు మోహన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి వెంకన్న, సిఐటియు జిల్లా నాయకులు వి ,శ్రీనివాసరావు తదితరులు పేర్కొన్నారు, శు క్రవారం చోడవరం ప్రధాన రహదారికి అనుకుని ఉన్న అంబేద్కర్ భవన్ లో రైతు సంఘం జిల్లా ఉపాధ్యాక్షులు యస్వీ నాయుడు అధ్యక్షతన ప్రజాసంఘాలు రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోవాడ చక్కెర కర్మాగారం రైతులు,కార్మికుల బకా యిల చెల్లించాలని, డిమాండ్ చేసారు ప్రభు త్వం కర్మాగారం ఆధునికరణ కు 350 కోట్లు తక్షణ సాయం క్రింద రైతు కార్మికులు బకాయిలకు 35 కోట్ల రూపాయలు విడు దల చేయాలని డిమాండ్లు పై ఈ సమావేశం తీర్మానం చేసిందన్నారు,ఫ్యాక్టరీని ఇక్కడ రైతాంగం ప్రజలు కాపాడు కోవాల్సిన ఆవశ్య కత ఎంతైనా ఉందన్నారు దీని కోసమే ఈనెల 21వ తేదీన గోవాడ ఫ్యాక్టరీ వద్ద మహా ధర్నాకు పిలుపునివ్వడం జరిగిందని తెలిపారు. ఈమహా ధర్నాలో రైతులు,కార్మికులు, ప్రజలు రాజకీయాలకు అతీతంగా పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సమావేశం పిలుపు నివ్వడం జరి గిందని తెలిపారు ప్రభుత్వం,పాలకుల నిర్ల క్ష్యంతో ఫ్యాక్టరీ పరిధిలోని రెండు నియో జకవర్గాల రైతాంగం తీవ్ర ఇబ్బందులు పాలవు తున్నారని ఏ రోజు ఫ్యాక్టరీ ఆగి పోతుందో తెలియని పరిస్థితి ఎర్పడిందని తెలిపారు తీసుకొచ్చిన చెరుకు ఎండకు ఎండి రికవరీ రాక రైతాంగం ఫ్యాక్టరీ నష్ట పోవలసిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు, ఈ పరిస్థితికి కారణ మైన ప్రభుత్వ విధా నాలపై రైతాంగం పెద్ద ఎత్తున పోరాడ వల సిన అవసరం ఉందన్నారు .ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే సీజనకు చెరకు లేక ఫ్యాక్టరీ పూర్తిగా మూత పడే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ మూత పడితే ఈ ప్రాంతమంతా ఎడారిగా మారే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం లోనే సహకారంగంలో నడుస్తున్న గోవాడ షుగర్ ఫ్యాక్టరీని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. రైతులు, కార్మికులు బకాయిలకై ఆధుని కరణకై ప్రభుత్వం తక్షణ సాయంగా 35 కోట్లు,ఆధునీకరణ కై రూ. 350 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ ఫ్యాక్టరీ లేక పోతే ఈ ప్రాంతంలో రైతులు,కార్మికులు రోడ్డున పడతారన్నారు.

అనంతరం గోవాడ షుగర్ ఫ్యాక్టరి చేరుకు పరిరక్షణ కమిటీ కన్వీనర్లు గా ఆర్ దేముడునాయుడు కో కన్వీనర్ యస్వీ నాయుడు నియమితులయ్యారు. ఈ సమా వేశంలో రైతు సంఘం జిల్లా.కోశాధికారి జి.నాయనబాబు, ఆర్ దేముడు నాయుడు, ఈ.ఎన్ మూర్తి, దేముళ్లు, డి తాతారావు, నర్సింగరావు, నాగిరెడ్డి సత్యనారాయణ, ఏ అప్పలనాయుడు, వి సత్యం, కోన మోహనరావు, బిటి దొర, అదిక సంఖ్యలో రైతు కార్మికులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ కి మోసపూరిత ప్యాకేజీ..!

ప్లాంట్ నడవడానికి నిధులు కేటాయించాలి - ప్లాంట్ కి సొంత గనులు ఇవ్వాలి




అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ ప్రతినిధి):- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శు క్రవారం అనకాపల్లి లో నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద నిరసన తెలియజేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు స్వంత గనులు కేటాయించి ప్లాంట్ నడవడానికి నిధులు కేటాయిం చాలని కార్మికులకు పూర్తి జీతాలు చెల్లిం చాలని, కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ఆపాలని,కూటమి ప్రభుత్వం ద్వంద వైఖరి మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కథ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకర్రావు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం 11 వేల కోట్ల రూపాయల ప్యా కేజీ ప్రకటించి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారని ఇచ్చిన ప్యాకేజీ ప్లాంట్ నడవడానికి, జీతాలు, ముడిసరుకు కి ఖర్చు పెట్టవద్దని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పాత అప్పులు కింద ఈ ప్యాకేజీ తీసుకుంటున్నారని ఇలా ఐతే ప్లాంట్ ఎలా నడుస్తుందని కావాలనే బీజేపీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ ని నష్టాల సాకు చూపి ప్రైవేటుపరం చేయాలని చూస్తున్నా రని ప్రజల ఆస్థి ప్రభుత్వ రంగాన్ని కాపాడు కోవాలిసిన బాధ్యత ప్రజలపై ఉందని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ కూటమి ప్రభు త్వం అధికారంలో రాకముందు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అడ్డుకుంటామని నిధులు తెచ్చి ప్లాంట్ నడిచే విధంగా చర్యలు తీసుకుంటా మని అన్నారని నేడు స్టీల్ ప్లాంట్ సమస్యను పట్టించుకోవడంలేదని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి కోటేశ్వరరావు మాట్లా డుతూ మోడీ ప్రభుత్వం ప్రవేట్ పరం చేయా లని ఆలోచనతోనే గనులు కేటాయించడం లేదని ఇంకా పనులు ప్రారంభం కానీ మెటల్ స్టీల్ ప్లాంట్ కు మాత్రం గనులు ఇవ్వాలని చంద్రబాబు నాయుడు మోడీని కలిశారని ప్రభుత్వ రంగం అంటే ఎంత చిన్న చూపు దీనిని బట్టి అర్థం అవుతుందని స్టీల్ ప్లాంట్ కార్మికులకు గత నాలుగు నెలలుగా పూర్తి జీతాలు చెల్లించడం లేదని కాంటాక్ట్ కార్మికులను తొలగిస్తున్నారని ఇది సరైనది కాదని ఎంపీ సీఎం రమేష్ ఎన్నికలకు ముందు స్టీల్ ప్లాంట్ విషయమై డైరెక్ట్‌గా ప్రధాని మోడీతో మాట్లాడి పరి ష్కరిస్తామని చెప్పాడని ఈ రోజు ఆయన అతి గతి లేకుండా ఉన్నారని చేతనైతే స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని లేక పోతే పదవికి రాజీనామా చేయాలని అన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ దొరబాబు మాట్లాడారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గంట శ్రీరామ్, ఏ రాజు, కె. తేలయ్య బాబు, జి. సుభాషిని, అప్పారావు, సిపిఐ నాయకులు ఆరు అప్పలరాజు కే శంకర్రావు రాజు తదితరుల పాల్గొన్నారు.

# గురుకుల విద్యాలయాలలో ప్రవేశాలు

అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):- 2025- 26 విద్యా సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దళికాస్తులు స్వీకరిస్తున్నట్లు గురుకుల పాఠశాలల జిల్లా కో ఆర్డినేటర్ వి.వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలల్లో 5,6,7,8 వ తరగతులు, ఇంటర్ ప్రథమ సంవత్సరం, డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరుటకు మార్చి 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులను ఆన్లైన్ విధానంలో https://aprs.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాఠశాలల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 25వ తేదీన ఉదయం, కళాశా లలో ప్రవేశాలకు అదేరోజు మధ్యాహ్నం ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. కావున ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియో గించుకొని గురుకుల విద్యాలయాలలో ప్రవేశాలు పొంది,చక్కటి విద్యను అభ్యసించాలని కోరారు.

# వైభవంగా సత్తమ్మ మరిడిమాంబ వార్షిక జాతర

అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక తీర్థ మహోత్సవం



సింహాచలం, (విశాఖ సమాచారమ్):- సింహాద్రి నాథుడు సోదరి, 14 గ్రామాల ప్రజల పొలిమేర దేవతగా పూజలు అందుకుంటున్న శ్రీ సత్తమ్మ తల్లి మరిడిమాంబ అమ్మవారి వార్షిక జాతర శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా సాంప్రదాయబద్ధంగా నిర్వహించే ఈ ఉత్సవాన్ని ఈ ఏడాది కూడా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిపించారు.. తెల్లవారుజామున అమ్మవారి కి సుప్రభాతం,ఆరాధన గావించారు అనంతరం క్యూలైన్లో ఉన్న భక్తులకు ఇబ్బందులు లేకుండా అమ్మ వారి దర్శన భాగ్యం కల్పించారు. పలు గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమ లు సమర్పించి ముడుపులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులు కు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ అని సదుపాయాలు కల్పించింది. అలాగే ప్రసాద వితరణ అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీను బాబు అధ్యక్షులు పి వెంకట్రావు. జాయింట్ సెక్రటరీ బలిరెడ్డి శ్రీనివాసరావు పారిశ్రామిక వేత్త బీవీ కృష్ణారెడ్డి. తదితరులు అంత అమ్మవారికి నూతన వస్త్రాలను సమర్పించారు. ఉదయం నుంచి రాత్రి భక్తులు కి వ్రరకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించగా ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమములు, అలంకరణ లు విశేషముగా అమ్మవారిని అలంక రించారు.. అమ్మని దర్శించుకున్న వారిలో పలువురు కార్పొరేటర్లు ప్రముఖులు ఉన్నారు.

# కాలనీ వాసుల ఇబ్బందులను అధికారులు పట్టించుకోవడం లేదు



పరవాడ, (విశాఖ సమాచారమ్):- జీవీఎంసీ 85 వ వార్డు లంకెలపాలెం దరి సింహాద్రి నగర్‌లో మురుగునీరు ఇళ్ళ ముందు చేరి దుర్వాసన వెదజల్లుతూ క్రిములు కీటకాలు దోమలతో గత ఆరు నెలలుగా కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కనీసం జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడం దురదృష్టకరమని వార్డు వైసిపి నాయకుడు గంజి సురేష్ ధ్వజమెత్తారు. గురువారం మురుగునీరు వద్ద రోడ్డుపై కూర్చొని ఆయన నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి తొమ్మిది నెలలు పూర్తవుతున్న లంకెలపాలెం జంక్షన్ కు అతి సమీపంలో ఉన్న ఈ కాలనీలో ప్రజలు ఇన్ని ఇబ్బందులు పడుతుంటే రాజకీయ నాయకులు , అధికారులు గానీ కనీసం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కాలువలు రోడ్లు నిర్మిస్తే, ఈ ప్రభుత్వ%శీ% మురుగునీరు వెళ్లడానికి మార్గాన్ని కూడా చూపకపోవడం విడ్డూరమన్నారు. తక్షణమే జీవీఎంసీ అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

# జనసైనికుల 12 వ ఆవిర్భావ సభ పిఠాపురం బయలుదేరిన జనసైనికులు



కొయ్యూరు, (విశాఖ సమాచారమ్):- కొయ్యూరు మండలం నుండి 200 మంది తొ కార్లు, ద్విచక్ర వాహనాలపై జనసేన పార్టీ 12 ఆవిర్భావ సభకు జన సైనికులు బయలుదేరి వెళ్లారు. జనసేన మండల అధ్యక్షుడు గూడెం లక్ష్మణ్, గౌరవ అధ్యక్షులు సాగిన బుజ్జిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం పిఠాపురం సభకు బయలుదేరి వెళ్లారు. వీర మహిళ నేత సెగ్గే భావన సాయి జయంతి కొబ్బరికాయ కొట్టి వాహన ర్యాలీని ప్రారంభించారు. ఏజెన్సీ 11 మండలాల నుంచి అరకు పార్లమెంట్ పాడేరు ఇంచార్జ్ ఒంపురు గంగులయ్య ఆధ్వర్యంలో సూచనలు సలహాలు ఆదేశాల మేరకు జనసైనికులు వీర మహిళలు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు గూడెం లక్ష్మణ్ కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గూడెపు శేషుబాబు, మండల ఆర్గనైజర్ పీ టా సుధీర్ బాబు, ఎం మాకవరం పంచాయతీ అధ్యక్షుడు పవన్,నెల్లిపూడి మండలాధ్యక్షుడు పొట్టిగ రాంప్రసాద్, బాలారం పంచాయతీ అధ్యక్షులు నవీన్, వైస్ ప్రెసిడెంట్ కుర్ర రాజేష్ నాగేంద్ర, కాకర కుమారి,గంటా శివాజీ, రాఘవ రాజు, బంగారు బాబు తదితరులు పాల్గొన్నారు.

# ఐఐటీ విద్యార్థులు ఆందోళన



కృష్ణా జిల్లా: ఈడుపుగల్లులో ఐఐటీ విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఐఐటీ మెడికల్ అకాడమీ మూసివేస్తూ విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. దీంతో 6 వందల మంది మొదటి సంవత్సరం విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అయితే అకాడమీ యాజమాన్యం మాత్రం ఫస్ట్ ఇయర్ విద్యార్థులను మరో ఐఐటీ క్యాంపస్‌లోకి తీసుకుంటామని చెప్పడంతో విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఈడుపుగల్లు ఐఐటీ మెడికల్ అకాడమీలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు.

# కన్నుల పండుగగా శ్రీవారి గరుడోత్సవం





అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- పట్టణంలోని దేమునిగుమ్మం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి కల్యాణ మహోత్సవంలో భాగంగా నాలుగవ రోజు స్వామివారు అమ్మవారు గరుడ వాహనంపై ఊరేగింపు అనకాపల్లి పట్టణ పురవీధులలో అత్యంత ఘనంగా జరిగింది ముందుగా దేవాలయం ప్రధాన అర్చకులు పులకండం విజయబాబు పులకండం గిరిబాబు ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించి గోవింద నామస్మరణతో జయ జయ ధ్వనులతో రథంపై, గరుడ వాహనాన్ని ఏర్పాటు చేసి గరుడ వాహనంపై దేవదేవుని విగ్రహములు నిలిపి భక్త బృందం సమర్పించిన గజమాలను స్వామివారికి అలంకరించి దిష్టి తీసి, మంగళ హారతులు ఇచ్చి గరుడ వాహనాన్ని ఆలయ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు ఎగ్జిక్యూటివ్ అధికారి టీ రాజ సులోచన దేవాలయం ప్రధాన అర్చకులు పులకండం గిరిబాబు ప్రారంభించారు.., ఈ భారీ ఊరేగింపులో అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని బృందాలు, మండపేట బ్యాండు, తప్పేడు గుళ్ళు సన్నాయి మేళాలు మంగళ వాయిద్యాలు,, బ్యాండ్,చిడతలు, కోలాటాలు, కాగడాలు, సంకీర్తనలతో, గోవింద నామ స్మరణతో, ఊరేగింపు కొలహాలంగా జరిగింది, భక్తులు ఎక్కడకక్కడకు విచ్చేసి స్వామి వారిని దర్శించి తీర్థప్రసాదాలు తీసుకున్నారు రాత్రి 9 గంటలకు కడిమిశెట్టి వారి వీధిలో చోర సంవాదం (ఉంగరం దొంగలించబడిందని) కీలక ఘట్టం జరిగిన ఊరేగింపుతో వెంకన్న ఆలయానికి వెంకటేశ్వర స్వామి చేరుకున్నారు ఈ కార్యక్రమంలో పులకడం ప్రసాద్ బాబు పులకండం రాజేష్ ధర్మకర్తలు గోలి మురళి సిహెచ్ నూకరాజు వేదుల సూర్య ప్రభ కొణతాల అరుణ, కొణతాల వాసు, సోమాదుల తులసి అధిక సంఖ్యలో భక్తులు ప్రజలు పాల్గొని గరుడ వాహన సేవను వీక్షించి మంత్రముగ్దులయ్యారు

## ఘనంగా లక్ష్మీదేవి అష్టోత్తర నామాల పూజ



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ఆధ్వర్యంలో పాల్గుణ మాసం పౌర్ణమి శుక్రవారం శ్రీ లక్ష్మీదేవి జయంతి సందర్భంగా ఆలయ మండపంలో సామూహిక మహిళల తో 108 లక్ష్మీదేవి అష్టోత్తర నామాలతో పూజ, పారాయణం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో, ఆలయ అధ్యక్షులు బిళ్ళపాటి కృష్ణ కుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు,ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన నూకాంబిక అమ్మవారి జాతర చాటింపు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం లో వెలిసిన శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో అమ్మవారి జాతర చాటింపు గురువారం నూకాంబిక అమ్మవారి దేవస్థానం నుండి అనకాపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జ్ భీమరశెట్టి రామకృష్ణ (రామ్‌కి) ఆధ్వర్యంలో జరిగింది. ఈనెల 28, 29 తేదీల్లో జరగబోవు జాతర కొత్త అమావాస్య సందర్భంగా పండగ చాటింపు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ ఉప కమిషనర్, ఆలయ ఈవో ఎన్ సుజాత, తెలుగుదేశం పార్టీ నాయకులు దాడి జైవీర్, జనసేన నాయకులు, పీలా నాగ శ్రీను,భక్తులు తదితరులు పాల్గొన్నారు

## పట్టణంలో జన సైనికుల భారీ బైక్ ర్యాలీ



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాజీ మంత్రి,అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆదేశాలు మేరకు అనకాపల్లి జనసేన పార్టీ ఇంఛార్జ్ రాంకీ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం భారీ ఎత్తున బైక్ ర్యాలీ జరిగింది. ర్యాలీని రామ్ కీ ప్రారంభించారు అంతేకాకుండా రాంకీ ర్యాలీ అగ్రభాగాన స్వయంగా బైక్ నడిపి జన సైనికులను ఉత్సాహపరిచారు. ఈ ర్యాలీ సందర్భంగా అనకాపల్లి పట్టణం రోడ్లు మొత్తం జనసైనికులతో నిండి పండగ వాతావరణం సృష్టించింది. ఈ కార్యక్రమంలో జనసేన శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం



తాళ్లపూడి, (విశాఖ సమాచారమ్):- తూర్పు గోదావరి జిల్లా తాడిపూడి గ్రామంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు గంటా కృష్ణ ఆధ్వర్యంలో జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వేగేశ్వరపురం జనసేన పార్టీ అధ్యక్షులు సత్తిబాబు, కాకర్ల సురేష్, ప్రక్కలంక జనసేన పార్టీ అధ్యక్షులు శ్రీను, మరియు తాడిపూడి ఎంపీటీసీ ఎంగ్రా వెంకటేశులు, బొక్క నాగేంద్ర, అంపోలు శివ మరియు గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గంటా కృష్ణ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఎటువంటి అవసరం వచ్చినా జనసేన పార్టీ అండగా ఉంటుందని తెలియజేశారు.

## పౌష్టికాహారం సక్రమంగా అందించాలి



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):- రాష్ట్ర ప్రభుత్వం వివిధ వర్గాల ప్రజలకు రేషన్ సరుకుల పంపిణీ వ్యవస్థ మరియు ఇతర ఫథకాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందించాలని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు గంజిమాల దేవి అధికారులను ఆదేశించారు. జిల్లాలో రెండవ రోజు క్షేత్ర పర్యటనలో భాగంగా గురువారం జిల్లాలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ గురకుల పాఠశాల, ఉన్నత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ పాఠశాలలు, అంగన్ వాడి కేంద్రం, భవిత కేంద్రాలను పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు.జిల్లా పౌర సరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎన్. మూర్తి ఇతర అధికారులతో కలిసి గవరపాలెం మహాత్మా జ్యోతిభాపూలే ఎ.పి.బి.సి. సంక్షేమ గురుకుల పాఠశాల, కొత్తూరు, ముత్రాసీకాలనీ, ఎలమంచిలి అంగన్ వాడి కేంద్రాలు, ఎం పి యు పి పాఠశాల, కొత్తపేట, ఎలమంచిలి జిల్లా పరిషత్ పాఠశాలలు, భవిత కేద్రం, పెద్దపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నక్కపల్లి కెజిబివి పాఠశాలలను సందర్శించి అక్కడ విద్యార్థులకు అందిస్తున్న బోజనం నాణ్యతను పరిశీలించారు.రికార్డులు, ఆహారపదార్థాల నిల్వలు, పదార్థాల నాణ్యత పరిశీలించారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి, ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నదని, వారికొరకు అందిస్తున్న పథకాలను సక్రమంగా అమలు చేయాలని తెలిపారు.విద్యార్థులతో మాట్లాడుతూ శత శాతం ఉత్తీర్ణత సాధించాలని,బాలికలు చక్కగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని తెలిపారు.ఈ తనిఖీ కార్యక్రమంలో సివిల్ సప్లై, మహిళా, శిశు అభివృద్ధి, పాఠశాల విద్య, ఫుడ్ సేఫ్టీ,తూనికలు %ఒ% కొలమానాల శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నూకాంబిక అమ్మవారి జాతర పోస్టర్ ఆవిష్కరణ



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- పట్టణంలోని తాకాశి వీధి లోవెలసిన శ్రీ, నూకాంబిక అమ్మవారి జాతర ఈనెల 28న, 29న కొత్త అమావాస్య పండగ సందర్భంగా , అనకాపల్లి జనసేన నియోజక వర్గం ఇంచార్జి, భీమర శెట్టి రామకృష్ణ ( రాంకీ ) చేతులు మీదుగా పోస్టర్, కరపత్రాల ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో, జనసేన నాయకులు, తాకాశి కన్నా బాబు (చిన్ని),శ్రీ రాందాస్ గోవిందు, తాడి రామకృష్ణ, తాకాశి సత్యం దోర, అప్పికొండ గణేష్,మంగ ఈశ్వర్, బర్ని కాన రాము, ఉత్సావ కమిటీ చైర్మన్, తాకాశి కిషోర్,ఉత్సవ కమిటీ మెంబెర్స్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## దేశ ప్రజలకు హెూలీ శుభాకాంక్షలు తెలిపిన అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):- దేశ ప్రజలందరికీ రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్ హెూలీ శుభాకాంక్షలు తెలియజేసారు.చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తు ఈ హెూలీ అని నిత్య జీవనంలోని కష్టాలను కాసేపు మరిచి, వయోభేదం లేకుండా అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి కేరింతలతో ఆనందోత్సాహాల నడుమ రంగులతో జరుపుకునే ప్రకృతి పండుగ హెూలీ అని పేర్కొన్నారు. హెూలీ పండుగ భారతీయ సామాజిక సాంస్కృతిక జీవన ప్రత్యేకతను చాటుతుందని వ్యాఖ్యానించారు.కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాలు జరుపుకునే ఈ పండుగ సమైక్యతకు అద్దం పడుతుందని అభిప్రాయపడ్డారు.ఈ హెూలీ పండుగ అందరి కుటుంబాల్లో ఆనందోత్సాహాలు నింపాలని ఆకాంక్షించారు

## విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం నడిపించాలి




పరవాడ, (విశాఖ సమాచారమ్):- విశాఖ ఉక్కు పరిశ్రమను ఉక్కు యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం పూర్తి సామర్థ్యంతో నడిపించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో పరవాడ సినిమా హాల్ జంక్షన్ వద్ద శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను తొలగించకూడదని యూనియన్ నాయకులను బెదిరింపులకు దిగడం ఉక్కు యాజమాన్యానికి తగదని ఉక్కు కార్మిక నాయకుడు అయోధ్య రాముకు ఇచ్చిన నోటీస్ వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు.

విశాఖ ఉక్కు యాజమాన్యం మొండి వైఖరి నశించాలని, ఆర్ఐఎన్ఎల్ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్లో విలీనం చేయాలని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి. నాయుడు, జి శ్రీనివాసరావు, ఎన్ గురునాధరావు, బి శ్రీను, కే నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీజేయూ జిల్లాల కన్వీనర్ల నియామకం



జాలే వాసుదేవ నాయుడు



చలాది పూర్ణచంద్ర రావు

విజయవాడ, (విశాఖ సమాచారమ్):- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండవ అతిపెద్ద జర్నలిస్ట్స్ యూనియన్ అయిన 'ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ యూనియన్ ఫర్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా (ఏపీజేయూ) 35వ వార్షికోత్సవ సంరంభం తిరుపతి లేదా అరకులలో నిర్వహిస్తామని యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాలే వాసుదేవ నాయుడు, చలాది పూర్ణచంద్ర రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ వ్యవస్థపక సభ్యులు, యూనియన్ కార్యవర్గంలో పనిచేసి ఇంతకాలం యూనియన్‌కు సేవలు అందించిన సీనియర్ నాయకులను సత్కరిస్తామన్నారు. కాగా ఏపీజేయూ అమరావతి-విజయవాడ రాజధాని రీజియన్ కన్వీనర్లుగా పొక్కులూరి సుబ్బారావు (గీతా సుబ్బారావు ), విస్సారపు దుర్గాప్రసాద్ లను నియమిస్తున్నట్లు వారు ప్రకటించారు. అలాగే ఏపీజేయూ వ్యవస్థాపక సభ్యుడు, సీనియర్ పాత్రికేయుడు ముదిగొండ నాగవీరభద్ర శాస్త్రి (ఆంధ్రజ్యోతి )ని కృష్ణా జిల్లా కన్వీనర్‌గా, సీనియర్ జర్నలిస్ట్ అనకాపల్లికి చెందిన పీలా మురళి మోహన రావును అనకాపల్లి జిల్లా కన్వీనర్ గా నియమించినట్లు తెలిపారు. యూనియన్ సభ్యత్వం పొందగోరే పాత్రికేయులు అమరావతి -విజయవాడ కన్వీనర్లు పి.సుబ్బారావు (8374069116), వి. దుర్గాప్రసాద్ (9492490028), ముదిగొండ శాస్త్రి (9866038608), పీలా మురళీమోహన్ (9515549939) లను సంప్రదించాలని కోరారు.

# బహుజన సూరీడు మాన్యశ్రీ కాన్షీరామ్

## (నేడు జయంతి)



పీడిత జనులను పాలకులుగా చూడాలనుకున్న అంబేద్కర్ కలలను నిజం చేసినవాడు కాన్షీరామ్. పంజాబ్ రాష్ట్రంలోని రోపార్ జిల్లా, కావాస్ పూర్ గ్రామంలో 1934 మార్చి 15న జన్మించారు. బిఎస్సీ చదివి 1959లో పుణె లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిలటరీ ఎక్స్‌ప్లోజివ్స్ సంస్థలో పరిశోధన అధికారిగా నియమితులయ్యారు. ఒక రామదాసీ/ చమర్ కులంలో పుట్టి సైంటిస్ట్‌గా ఎదిగి తన లక్ష్యా న్ని నిర్దేశించుకున్న అసమాన వ్యక్తి కాన్షీరామ్. అంబేద్కర్ గురించి తీవ్రంగా ఆలోచించడం ప్రారంభించిన ఆయన అంబేద్కర్ సామాజిక, రాజకీయ జీవితాన్ని లోతుగా అధ్యయనం చేశారు. కుల నిర్మూలన పుస్తకం కాన్షీరామ్‌ను తీవ్రంగా ప్రభావితం చేసింది.

1963లో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిలిటరీ ఎక్స్‌ప్లోజివ్స్‌లో పని చేస్తున్న కాలంలో దీనాబానా అనే నాల్గవ తరగతి ఉద్యోగిని బర్తరఫ్ చేయడాన్ని కాన్షీరామ్ తీవ్రంగా ప్రతిఘటించి ఆందోళన ప్రారంభించారు. ఆయన చేసిన చట్టబద్ధ పోరాటం వల్ల ఆమెను తిరిగి ఉద్యోగంలోకి తీసుకోడం జరిగింది. అదే విధంగా ఒక దళిత స్త్రీని ఉద్యోగంలోకి తీసుకోకుండా వివక్ష చూపుతుంటే ఆయన ఉద్యోగంలోకి చేర్చడానికి పోరాటం జరిపారు. ఈ రెండు ఘటనలు కాన్షీరామ్‌లో పోరాటం స్ఫూర్తి నింపాయి. తమ జాతి జనులకు ఏదో చేయాలనే తపన ఆయనలో పెరిగింది. అంబేద్కర్ నడిపిన ఉద్యమాలను, గ్రంథాలను శోధించడం, పరిశీలించడం ప్రారంభించిన కాన్షీరామ్ అంబేద్కర్‌తో పాటు మహాత్మా జ్యోతిరావు పూలే, ఛత్రపతి సాహు మహారాజ్, నారాయణ గురు, పెరియార్ రామ స్వామి వంటి నాయకుల పోరాటాలను అధ్యయనం చేశారు. వారి ప్రభావంతోనే 1971లో ఎస్సీ , ఎస్టీ , ఓబీసీ,మైనారిటీ సంక్షేమ సంఘంను ఏర్పాటు చేశారు. పీడిత ప్రజలు కులాలుగా, ఉప కులాలుగా విడిపోయి ఉండటంవల్ల రాజ్యాధికారానికి దూరం గా ఉన్నారని, ఈ చిన్నచిన్న సమూహాలను బహుజన సమూహంగా మారిస్తే అధికారం చేజిక్కించుకోడం సాధ్యమవుతుందని గ్రహించిన కాన్షీరాం దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయాలని, ప్రజలను చైతన్యవంతం గావించచాలనే దృఢ సంకల్పానికి వచ్చారు.

కుల ప్రాతిపదికన అస్తవ్యస్తంగా ఉన్న సమాజాన్ని మార్చడానికి, నిజాయితీతో కూడిన సమరశీల శక్తిగా ఎదగడానికి బ్రహ్మచర్యం పాటించాలని కఠిన నిర్ణయం తీసుకున్నారు. కాన్షీరామ్‌కి పెళ్లి చేయాలని కుటుంబం నిర్ణయిస్తే బహుజన సమాజమే తన కుటుంబం అని, అంబేద్కర్ చేపట్టిన మహెూన్నత సామాజిక ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడం తన జీవిత లక్ష్యమని, తాను చనిపోయినట్లు తన కుటుంబ సభ్యులందరూ భావించాలని 1965లో తల్లిదండ్రులకు ఉత్తరం రాశారు. దళితుల విముక్తే లక్ష్యంగా ఒక భుజాన సంచితో, పాత సైకిల్‌తో కాళ్లకు చెప్పులు లేకుండా ఊరూరా కరపత్రాలు పంచుతూ ఆకలి, దాహం మరచిపోయి అనేక ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు.విద్యార్థులను, ఉద్యోగులను పోగేసి సమావేశాలు ఏర్పాటు చేసి అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని వారితో పంచుకునేవారు. కాన్షీరామ్ ఆలోచనా విధానం నచ్చిన ఉద్యోగులు ఆయన వెంట నడవడానికి సిద్ధపడ్డారు.

బోధించు, పోరాడు, సమీకరించు అనే నినాదంతో 1978, డిసెంబర్ 6న 'బామ్ సెఫ్'ను స్థాపించాడు. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, మైనారిటీ ఉద్యోగులను ఏకం చేసి దోపిడీకి గురవుతున్న తమ జాతి ప్రజల రుణం తీర్చుకోవడమే ధ్యేయంగా ఏర్పడింది. 'పే బ్యాక్ టు సొసైటీ' అనే నినాదంతో సమాజానికి విద్యావంతులైన ఉద్యోగులు తమ మేధస్సును, డబ్బును, ప్రతిభను అందించాలని కాన్షీరామ్ కోరారు. కాన్షీరామ్ కోరిక మేరకు ఎంతో మంది ఉద్యోగులు 'బామ్ సెఫ్' కార్యక్రమాలలో పాల్గొని సమాజ అభివృద్ధికి కృషి చేశారు. 1981 డిసెంబర్ 6న ప్రజలను పోరాటం వైపు నడపడానికి డిఎస్ఎస్ఎస్ ఎస్ (దళితా సోషిత్ సమాజ్ సంఘర్షణ సమితి)ను స్థాపించారు. ఇందులో పెద్ద ఎత్తున విద్యార్థులు, యువత చేరారు. రాజ్యాధికారం కోసం కృషి చేయండి అని అంబేద్కర్ చెప్పిన మాటలు గుర్తు చేస్తూ , యువతను చైతన్య పరుస్తూ 1983 మార్చి 15 న ఢిల్లీ నుండి బయలుదేరి ఏడు రాష్ట్రాల మీదుగా 100 సైకిళ్లతో 40 రోజులలో 4,200 కిలో మీటర్లు ప్రయాణించి ప్రజలను బహుజన ఉద్యమం వైపు మరల్చిన గొప్ప దార్శనికుడు కాన్షీరామ్. అలుపెరుగని పోరాటంతో ఉత్తరప్రదేశ్లో అధికారాన్ని హస్తగతం చేసుకోవడమే కాక దేశంలోని మిగతా ప్రాంతాలను ద్వితీయ శక్తిగా ఎదిగారు. ' మన టిక్కెట్లు మనమే ఇచ్చుకుందాం మన ఓటు మనమే వేసుకుందాం' అనే ఉద్దేశంతో 1982లో హర్యానా, ఢిల్లీ, పంజాబ్, జమ్మూకశ్మీర్ ఎన్నికలలో దళిత్ సోషిత్ సమాజ్ సంఘర్షణ సమితి పాల్గొని పోటీ చేసిన పార్టీలలో నాలుగవ స్థానాన్ని సాధించింది.

ఎన్నికలలో బహుజనులు పూర్తిగా మద్దతు తెలిపారు. బహుజనులకు ఒక రాజకీయ పార్టీ అవసరాన్ని తెలుపుతూ ప్రచారం చేశారు. 1984 ఏప్రిల్ 14న అంబేద్కర్ జయంతి నాడు లక్షలాది ప్రజల ముందు కాన్షీరామ్ పార్టీ పేరు బహుజన సమాజ్ పార్టీ, ఎన్నికల గుర్తు ఏనుగును ప్రకటించారు. పూలే ఉద్యమం నుండి బహుజన సమాజ్ పేరును, అంబేద్కర్ ఉద్యమం నుండి నీలి జెండా, ఏనుగు గుర్తును తీసుకున్నట్లు ప్రకటించారు. 1984 నుండి జరిగిన ఎన్నికలలో బిఎస్‌పి తన అభ్యర్థులను నిలబెడుతూ జాతీయ పార్టీలకు గట్టి పోటీని ఇస్తూ ముందుకు సాగింది. 1989లో బిఎస్‌పి ఉత్తర ప్రదేశ్‌లో రెండు లోక్‌సభ, 13 అసెంబ్లీ స్థానాలు కైవసం చేసుకుంది. 1993 ఉత్తరప్రదేశ్ ఎన్నికలలో బిఎస్‌పి, ఎస్‌పి సంకీర్ణ కూటమి విజయం సాధించి ములాయం సింగ్ ప్రభుత్వంలో బిఎస్‌పి సభ్యులు మంత్రులుగా ఉండడం దేశ ప్రజలను ఆశ్చర్యంలోకి నెట్టడమే కాక బ్రాహ్మణీయ శక్తులకు కంటి మీద కునుకు లేకుండా చేసింది. బహుజన సమాజ్ పార్టీని జాతీయ పార్టీగా తీర్చిదిద్దడంలో కాన్షీరామ్ నిరంతరం శ్రమించి విజయం సాధించారు. ఇతర రాజకీయ పార్టీల మద్దతుతో మాయావతి ముఖ్యమంత్రిని చేశారు. దేశంలోని అతిపెద్ద రాష్ట్రానికి మాయావతిని ముఖ్యమంత్రి చేయడం మామూలు విషయం కాదు. కాన్షీరామ్‌కే అది చెల్లింది.. ఒక ఓటు - ఒక నోటు అనే నినాదంతో ప్రజల దగ్గరికి వెళ్లి వారిచ్చే డబ్బుతోనే ప్రచారం చేసాడు. కులాన్ని నిర్మూలిద్దాం- బహుజన సమాజాన్ని నిర్మిద్దాం. అంటూ దేశ వ్యాప్తంగా ఉద్యమం చేపట్టాడు . నువ్వు 85 శాతం ఉండగా 15% మీద ఎందుకు ఆధారపడతావు?. నడువు పార్లమెంటు , అసెంబ్లీకు . నీ కాళ్ళ మీద నువ్వే నడువు అంటూ బహుజనులను పురిగొల్పాడు. ప్రజల భూమి మీద ప్రజలకు హక్కు లేదా ? అనేవారు. కులాన్ని కులంతోనే జయించాలని , కులాన్ని రాజకీయ ఆయుధంగా వాడుకున్నాడు యూపిలోని చమార్లను పునాదిగా చేసుకుని పంజాబ్, హర్యానా, ఢిల్లీ, కాశ్మీర్, బీహార్, మధ్యప్రదేశ్ , ఉత్తరప్రదేశ్లలో ఇతర కులాలను కలుపుకొని పార్టీనీ బలోపేతం చేసాడు. 1984 లో ప్రారంభమైన బిఎస్పీ 1996 నాటికి నాటికి పార్టీగా ఎదిగింది 2006 అక్టోబర్ 6 న కాన్షీరామ్ మరణించాడు.

– డా. పసలపూడి వెంకట రామ్
9553574250

# చెరువులో అక్రమంగా చెట్లు నరికివేత...!

## సొమ్ము చేసుకుంటున్న వ్యాపారస్తులు పట్టించుకోని ఇరిగేషన్, రెవిన్యూ అధికారులు



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్): –** మండలంలోని దిబ్బిడి జానకమ్మ చెరువులో రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోవెలపల్లి రెవిన్యూ పరిధిలో దిబ్బిడి జానకమ్మ చెరువులో అక్రమంగా చెట్లు నరికి వ్యాపారస్తులు సొమ్ము చేసుకుంటున్నారు.దిబ్బిడి గ్రామ రైతులు ఆనకట్టుగా ఉన్న జానకమ్మ చెరువు మీద ఆధారపడి ఎన్నో ఏళ్ల నుంచి స్థానిక రైతులు జీవనం కొనసాగిస్తున్నారు. కోవెలపల్లి రెవిన్యూ పరిధిలో ఉండటం వల్ల ఆ గ్రామానికి సంబంధించిన కొంతమంది వ్యక్తులు కొన్ని నెలల నుంచి రాత్రి సమయంలో చెట్ల నరికి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని రైతులు రెవిన్యూ తహసీల్దార్, ఇరిగేషన్, పోలీసు వారికి పలుమార్లు ఫిర్యాదు చేసిన ఎటువంటి స్పందన లేకపోవడంతో ఎట్టకేలకు జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేయగా వారు స్పందించారనీ గ్రామస్తులు తెలియజేశారు. జానకమ్మ చెరువు రైతుల పంట పొలాలతో పాటు పశువులు మేత మెయ్యడానికి తిరుగుతూ జీవనం ఆధారం కూడా చెరువులో చెట్లు ద్వారా జీవనం సాగిస్తున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా చెట్లు నరికి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకొని మేము ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న చెరువు లో ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండా చూడవలసిన బాధ్యత అధికారులకు తీసుకోవాలని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. లేనియెడల కలెక్టర్ ఆఫీస్ ని ముట్టడించే కలెక్టర్ ఎదుటి ధర్నా చేపడతావని మీడియా ద్వారా తెలియజేస్తున్నారు.

# మరో మైనర్ బాలికను తల్లిదండ్రులకు అప్పగింత



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** పశ్చిమ బెంగాల్ లోని బహిర్గచ్చి గ్రామం నుండి సంగీత బిస్వాస్ (17), మైనర్ బాలిక పారిపోయి వచ్చేసింది.విశాఖపట్నం రైల్వే స్టేషన్లో ఈనెల 8 వ తేదీన రైల్వే పోలీసులకు పట్టుబడింది. ఏయూటీడి సిబ్బందికి సమాచారం రావడంతో తీసుకుని వచ్చి, జీవియంసి మహిళా షెల్టర్ హెూం లో వసతి కల్పించడం జరిగింది. ఈ అమ్మాయి మైనర్ కావడంతో తల్లిదండ్రులను హుటాహుటిన వైజాగ్ రప్పించి దేబసిస్ బిశ్వాస్ దంపతులకు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు సమక్షంలో అప్పగించడం జరిగింది. తల్లి ఇచ్చిన సమాచారం ప్రకారం ఇంట్లో గొడవపడి వచ్చేసిందని, క్షేమంగా అప్పగించినందుకు ఏయూటీడి సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

## వైఎస్ వివేకా హత్య కేసు, సాక్షుల వరుస మరణాలు... దస్తగిరికి భద్రత పెంపు

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సాక్షులు వరుసగా అనుమానాస్పదంగా మృతి చెందుతుండటం కలకలం రేపుతోంది. ఈ నేపథ్యంలో, ఈ కేసులో అప్రూవర్ గా మారిన దస్తగిరికి పోలీసులు భద్రతను పెంచారు. ప్రస్తుతం దస్తగిరికి 1 ప్లస్ 1 సెక్యూరిటీ ఉండగా... దీన్ని 2 ప్లస్ 2కి పెంచారు. ఈ మేరకు కడప జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వివేకా హత్య కేసులో సాక్షులు వరుసగా మృతి చెందడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ కడప జిల్లా ఎస్పీ కార్యాలయానికి దస్తగిరి వెళ్లారు. తనకు భద్రత పెంచాలంటూ జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందించారు. తాను కడప జైల్లో ఉన్నప్పుడు డాక్టర్ చైతన్య రెడ్డి తనను బెదిరించారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో దస్తగిరికి పోలీసులు భద్రతను పెంచారు.

## చరిత్రలో ఈ రోజు (మార్చి 15)



1493: అమెరికా మొదటి పర్యటన అనంతరం స్పెయిన్ చేరిన కొలంబస్.

1564: మొఘల్ చక్రవర్తి అక్బర్ జిజియా పన్నును రద్దు చేశారు.

1767: అమెరికా మాజీ అధ్యక్షుడు ఆండ్రూ జాక్సన్ జననం.

1915: మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో కాన్స్టాంటినోపిల్ సంధి జరిగింది.

1934: భారత దేశంలో ప్రముఖ దళిత నేత కాన్షీరాం జననం. (మరణం: 2006)

1937: ప్రముఖ తెలుగు సాహితీ విమర్శకుడు వల్లంపాటి వెంకటసుబ్బయ్యజననం.

1950: భారత ప్రణాళికా సంఘం ఏర్పాటు.

1977: భారత సైనికదళం మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ (మరణం: 2008)

1985: మొట్టమొదటి అంతర్జాల డొమైన్ పేరు నమోదు.

1990: మొట్టమొదటి సోవియట్ యూనియన్ అధ్యక్షుడిగా గోర్బచేవ్ ఎన్నిక.

# అత్యంత వైభవంగా భోగ లింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం



**అనకాపల్లి (విశాఖ సమాచారమ్):–** పట్టణంలోని కోట వీధిలో స్వయంభుగా వెలసిన శ్రీ సర్వకామదాంబ సమేత శ్రీ భోగలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది . స్వామి వారి కళ్యాణం సందర్భంగా ఆలయ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు . అర్చక స్వాములు స్వామి వారి కళ్యాణం తిలకించిన వారికి అష్టైశ్వర్యాలు తోపాటు సుఖ సంతోషాలు అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని అన్నారు. ఆనందంగా కోరిన కోర్కెలు తీర్చే సర్వకామదాంబ అమ్మవారి ఆశీస్సులు భక్తులకు ఎల్లవేళలా వెన్నంటే ఉంటాయని అన్నారు. కళ్యాణానికి ముందు అర్చక స్వాములు గణపతి పూజ, రక్షాబంధం పూజ, పుణ్యాహవాచనం, కార్యక్రమాన్ని లక్ష్మీనారాయణ పంతులు పర్యవేక్షణలో జరిగింది స్వామివారి కల్యాణ మహెూత్సవానికి హాజరైన భక్తులకు ఆలయ కమిటీ లడ్డు పులిహోర పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో బి. మురళీకృష్ణ ధర్మకర్తలు మద్దాల నారాయణరావు పెంటకోట గణేష్ కుమార్ ,మల్ల సూరిబాబు, రాపేట్ సంతోష్ కుమార్ ,శ్రీ సర్వకామదాంబ మాజీ చైర్మన్ కొణతాల కారుబాబు, అర్చక స్వాములు పేరూరు సూర్యనారాయణ భోగలింగేశ్వరావు వేణుగోపాలు పరమేశ్వరరావు, కార్తీక్, యలమంచిలి బంగారురాజు అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

# బదిలీల సమస్యలను మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్తాం

## నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు టి వి రమణ



**అనకాపల్లి (విశాఖ సమాచారమ్):–** రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న ఉపాధ్యాయ బదిలీల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లతో సహా అన్ని స్థాయిల బదిలీలను మాన్యువల్ కౌన్సిలింగ్ విధానంలో నేరుగా ఉపాధ్యాయులు ఎంచుకునే విధంగా నిర్వహించాలని తెదేపా అనుబంధ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుంపాల వెంకట రమణ నక్కా శ్రీనుబాబు కోరారు. అనకాపల్లి సిపిఐ గోవిందరావు భవనంలో శుక్రవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. బదిలీ లకు సంబంధించి అన్ని సమస్యలను ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి సభ్యులు డాక్టర్ వేపాడ చిరంజీవి రావు ద్వారా మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకు వెళ్ళనున్నామన్నారు. అలాగే నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులకు వివరించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామన్నారు. ఎస్జీటీలకు మాత్రం ఆన్లైన్ కౌన్సిలింగ్ అంటూ కొందరు అధికారులు ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. దీనిని ఉపాధ్యాయులంతా వ్యతిరేకిస్తున్నందున దీనిపై మంత్రి నారా లోకేష్ గారు ప్రత్యేక దృష్టి పెట్టి ఎన్ని రోజులు పట్టినా , ఎన్ని సమస్యలు ఎదురైనా తప్పనిసరిగా మాన్యువల్ కౌన్సిలింగ్ ద్వారానే అన్ని బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో గిరిజన ప్రాంతానికి ఊహించని విధంగా బదిలీ అయిన మైదాన ప్రాంత ఉపాధ్యాయుల కు న్యాయం చేయాలని కోరారు. తప్పుల తడకగా ఉన్న ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలను సవరించాలని, ఉపాధ్యాయులను యాప్ భారం నుంచి పూర్తిగా మినహాయించాలని కోరారు. అలాగే ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలన్నీ విడుదల చేయాలన్నారు. ఈ నెలలో ఐదు వేల కోట్ల బకాయిలను విడుదల చేస్తున్న నిర్ణయం పట్ల హర్షం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సిపిఎస్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర నాయకుడు రొంగలి అప్పలరాజు , సంఘ ప్రతినిధులు కోట్ని రాంబాబు, వీరునాయుడు, లక్ష్మణ్, లోకేష్, విద్యాసాగర్, రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన అనకాపల్లి మండల శాఖ ఎన్నికల్లో అధ్యక్షులుగా సిహెచ్. లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా కె.విద్యాసాగర్ ఎన్నికయ్యారు.

# హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

## జీఓ నంబర్ 3ని పునరుద్ధరించాలి : మాజీ శాసన సభ్యురాలు భాగ్యలక్ష్మి



**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):–** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయడం లో కూటమి ప్రభుత్వం విఫలమయిందని పాడేరు మాజీ శాసన సభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం మండలంలో పర్యటించిన ఆమె స్థానిక పార్టీ నాయకులు ,కార్యకర్తలతో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి అధ్యక్షుడు వై ఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు యువజన పోరు కార్యక్రమం విజయవంతం చేశామన్నారు. 2014 నుంచి 19 వరకు అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తామని, ఉద్యోగం ఇవ్వలేని పక్షంలో, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన హామీని అమలు చేయకపోవటం పై, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున ప్రశ్నిస్తున్నా మన్నారు. రానున్న ఐదు సంవత్సరాల కాలంలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని సి.ఎం చంద్రబాబు నాయుడు చెప్పారన్నారు. దీని ప్రకారం సంవత్సరానికి నాలుగు లక్షల ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. గత 2024 జూన్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిందని, రెండు మూడు నెలల్లో ఏడాది పూర్తవుతుందని, ఇప్పటికి ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు.

రాష్ట్రంలో నిరుద్యోగులు ఎంతమంది ఉన్నారు? వాళ్ళందరికీ నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారు? ప్రశ్నిస్తున్నామన్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విద్యావ్యవస్థలో చాలా విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకోవటం జరిగిందన్నారు.

అమ్మ ఒడి ద్వారా ప్రతి తల్లికి ఐదు సంవత్సరాలు కాలంలో వాళ్ళ అకౌంట్ లోకే నేరుగా నగదు జమ చేయడం జరిగిందన్నారు. తల్లికి వందనం కింద ఎంతమంది పిల్లలు ఉంటే అంత మంది పిల్లలకి 15 వేల రూపాయలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారన్నారు.కానీ నేటి వరకు కూడా ఆ మాటే అమలుకాలేదన్నారు. అలాగే నాడు- నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాల ల రూపురేఖల్ని మార్చి, పిల్లలకి కావాల్సినటువంటి మౌలిక సదుపాయాలు తమ ప్రభుత్వం ద్వారా అమలు పరచామన్నారు..అయితే నేడు విద్య వ్యవస్థని సర్వనాశనం చేసినటువంటి ప్రభుత్వం కూటమి ప్రభుత్వ మన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జి.ఓ నెంబర్ 3 ని పునరుద్దిరంచాలని, అన్నారు. అదేవిధంగా డీఎస్సీ ద్వారా 16, వేల పోస్ట్ లకు నోటిఫికేషన్ ఇవ్వటం జరిగిందని, కానీ ఈరోజు జీవో నెంబర్ 3 గిరిజన ప్రాంతంలో లేకపోవడంతో ఈ ప్రాంతీయులకు వచ్చేది కేవలం 6 పర్సంటేజీ మాత్రమే అన్నారు.

ఈ కార్యక్రమంలో చింతపల్లి మండలాధ్యక్షురాలు కోరాబు అనూషా దేవి ,గూడెంకొత్తవీది ఎం.పి.పి.బోయిన కుమారి, స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# నాగులపల్లి గ్రోయిన్ మరమ్మతులు చేపట్టాలి

## అఖిలపక్ష నేతలు డిమాండ్



**అనకాపల్లి, (విశాఖసమాచారమ్):–** మండలంలోని మూల పేట గ్రామం శారద నది దగ్గర గల నాగులపల్లి గ్రోయిన్ ను గ్రామ అభివృద్ధి సాధన సమితి కన్వీనర్ కోన లక్ష్మణ్ ఆధ్వర్యంలో అఖిలపక్ష నేతలు, రైతులు సందర్శించి గ్రోయిన్ మరమ్మతులు వెంటనే చేపట్టాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనకాపల్లి పరిసర గ్రామాల రైతులకు వ్యవసాయానికి సాగు నీరు, అనకాపల్లి పట్టణం మరియు పరిసర ప్రాంతాలకు తాగునీరు అందిస్తున్న నాగులాపల్లి గ్రోయిన్ దశాబ్ద కాలంగా శిథిలావస్థకు చేరి ఎటువంటి మరమ్మతులకు నోచుకోకపోవడం అత్యంత బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు రానున్న ఏప్రిల్, మే, జూన్ వేసవిలో ఎండల తీవ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉన్నందున నదుల్లో నీరు ఇంకిపోయి సుమారు 10 గ్రామాల ప్రజలు మరియు పట్టణం ప్రాంత ప్రజలు,త్రాగునీరు, రైతులు వ్యవసాయానికి సాగునీరు అవసరాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్నందునస్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, సంబంధించిన అధికారులు వెంటనే స్పందించి గ్రోయిన్ మరమ్మత్తులు చేపట్టిన యెడల రైతులతో కలిసి ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ అనకాపల్లి ఇన్ ఛార్జ్ కొణతాల హరినాథ్ బాబు, బహుజన సమాజ్ పార్టీ నియోజవర్గం ఇన్ ఛార్జ్ సూదికొండ మాణిక్యాలరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కార్యదర్శి కోరుబిల్లి శంకర్రావు, రైతులు బొర్ర రాజు, రాము పాల్గొన్నారు.

# వైద్యులు ఆసుపత్రిలో అందుబాటులో ఉండాల్సిందే



**అరకులోయ, (విశాఖ సమాచారమ్):–** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే ఇద్దరు వైద్యులు ఎవరో ఒకరు కచ్చితంగా హాస్పటల్లో అందుబాటులో ఉండాలని తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గ ఇన్చార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర పేర్కొన్నారు. పెదబయలు మండలం గోమంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయన తనిఖీలు నిర్వహించే సమయంలో వైద్యులు ఎవరూ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు పనిచేస్తున్న ఒకరు కూడా రోగులకు అందుబాటులో లేకపోవడంపై ఆయన ఆరా తీశారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ కచ్చితంగా వైద్యులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందుబాటులో ఉండాలని ఆయన ఆదేశించారు. ఒకరు ఆసుపత్రిలోనూ మరొకరు ఫీల్డ్ లోనూ ఉంటారని ఆ విధానంలో ఎటువంటి మార్పు లేదని అందువలన రోగులకు ఎటువంటి సమస్య లేకుండా వైద్యులు సర్దుబాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రజలు ఇబ్బంది పడితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న సేవలను వారి దగ్గరికి వెళ్లి స్వయంగా ఆయనే ఆరా తీశారు. ఆయన కూడా కొన్ని పరీక్షలు చేసుకున్నారు. దొర గారి వెంట సర్పంచ్ ఉడు లక్ష్మిపాతి, ఎంపిటిసి, వన్సర్భ మచేకొండబాబు , ఎంపీపీ బొండా వరహాలమ్మ, ఎంపిటిసి కిమంకరి బొంజుబాబు, మాజీ ఎంపీపీ కొండయ్య, ఎంపిటిసి పూర్యకరి భాస్కరరావు, బోండా వినోద్, టీడీపీ సీనియర్ నాయకుడు లొట్టి చిన్ని, బూటరీ మోహనరావు, బొజ్జిబాబు, పూజారి సత్యారావు, వార్డు సభ్యులు కంజరి సింహాచలం, తలోయి లక్ష్మీపతి, డుంబ్రిగూడ మండలం సాగర పంచాయతీ సర్పంచ్ కొర్ర సీతారాం, పిఎసిఎస్ మాజీ చైర్మన్ కొమ్ములు నాయుడు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గిరిజనులకు మేలు చేయకున్నా పరవాలేదు.. కీడు చేయకండి

## ఏపీ కాంగ్రెస్ ఎస్టీ సెల్ చైర్మన్ నవభారత్

**చింతపల్లి, (విశాఖ సమాచారమ్):–** గిరిజనులకు మేలు చేయకున్నా పర్వాలేదు కానీ కీడు చేసేలా వ్యవహరించొద్దని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవిని ఉద్దేశించి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ చైర్మన్ నవభరత్ అన్నారు. గిరిజనురాలిగా మీరు గిరిజనులకు మేలు చేయకున్నా మేము మిమ్మల్ని నిందించమని, కానీ భూ బదలాయింపు నియంత్రణ చట్టాన్ని సవరించమని ఉచిత సలహాలు ఇవ్వడానికి ప్రయత్నించవద్దని హితవు పలికారు. అసెంబ్లీలో రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష దేవి గిరిజన చట్టాలను అవమానించే విధంగా గిరిజన ప్రాంతంలో గిరిజ నేతరులకు పక్కా ఇల్లులు మంజూరు చేయాలని మాట్లాడడం చాలా బాధాకరమని అన్నారు. ఆమె మాట్లాడిన వాక్యాలను వెనక్కి తీసుకోవాలని లేకుంటే గిరిజనాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో అంగన్వాడి టీచరుగా పనిచేస్తూ రాజ్యాంగబద్ధంగా ఎన్నికైనటువంటి గిరిజన ఎమ్మెల్యే గిరిజన ప్రాంతంలో జీవనం సాగిస్తున్న గిరిజనేతరులకు పక్కా ఇల్లు మంజూరు చేయాలని అసెంబ్లీలో మాట్లాడడం దారుణమన్నారు. రాజ్యాంగంలో గిరిజనులకు కల్పించిన గిరిజన చట్టాలు హక్కులను ఓ సారి చదవాలని, రాజ్యాంగం అంటే అంగన్వాడి రికార్డులు కావని ఎద్దేవా చేశారు. అవగాహన లేకుండా మాట్లాడడం



అవమానపరచడమేనన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాల వల్ల గిరిజన చట్టాలు, హక్కులు కనుమరుగు అవుతున్న సందర్భంలో గిరిజన హక్కుల రక్షణ కోసం కృషి చేయడం మానేసి, గిరిజన ఎమ్మెల్యే అయ్యుండి అసెంబ్లీలో అటువంటి వాక్యాలను చేయడం దురదృష్టకరమన్నారు. ఇటీవల రాజ్యాంగ పదవిలో ఉన్న రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు 1/70 చట్టాన్ని సవరణ చేయాలని చేసిన వ్యాఖ్యలు, నేడు గిరిజన ఎమ్మెల్యే శిరీష దేవి వ్యాఖ్యలు చూస్తుంటే కూటమి ప్రభుత్వం ప్రణాళిక ప్రకారం చేస్తుందని అనుమానంగా ఉందని అన్నారు. గిరిజన చట్టాలు హక్కులపై ఎటువంటి గౌరవం ఉన్న కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి అసెంబ్లీలో ప్రకటన చేయాలని అటువంటి వ్యాఖ్యలు చేసిన ప్రజా ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే భవిష్యత్తులో జరిగే ఉద్యమాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# క్రీడా సమాచారమ్

## నా జట్టుకు రోహితే కెప్టెన్

### పాక్ మాజీ క్రికెటర్ బసిత్ అలీ




**ఇంటర్నెట్ డెస్క్:** ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు చేరిన భారత్, న్యూజిలాండ్ జట్ల నుంచే ఎక్కువమందిని పాక్ మాజీ క్రికెటర్ తన బెస్ట్ టీమ్‌కు ఎంపిక చేశాడు. ఎనిమిదేళ్ల తర్వాత జరిగిన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్ఇండియా విజేతగా నిలిచింది. భారత కెప్టెన్ రోహిత్ శర్మ ఫైనల్‌లో అద్భుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. అయితే, ఐసీసీతోపాటు ఇతర మాజీలు ప్రకటించిన జట్టులో అతడికి చోటు ఇవ్వలేదు. కానీ, పాకిస్థాన్ మాజీ క్రికెటర్ బసిత్ అలీ మాత్రం తన జట్టుకు సారథిగా రోహిత్‌నే ఎంపిక చేస్తానని వెల్లడించాడు. ఆమేరకు బసిత్ ప్రకటించిన టీమ్‌లో భారత్ నుంచి ఏకంగా ఆరుగురికి అవకాశం ఇవ్వడం గమనార్హం.

"నేను కూడా 11 మందితో కూడిన జట్టును ఎంపిక చేశా. దుబాయ్ వేదికగా మ్యాచ్‌లను చూశాం. గడాఫీ స్టేడియంలోనూ మంచి ప్రదర్శనలు ఇచ్చారు. నేను ఏ ఆటగాడు బాగా ఆడాడని భావించానో వారితోనే తుది జట్టును ప్రకటిస్తున్నా. ఐసీసీ జట్టును సరిపోల్చడం లేదు. నా టీమ్ కెప్టెన్‌గా రోహిత్ ఉంటాడు. టోర్నీ ఆసాంతం సారథిగా అద్భుతంగా రాణించాడు. ఫైనల్‌లో అర్ధశతకం సాధించాడు. మ్యాచ్ గతినే మార్చేశాడు. రోహిత్‌కు జోడీ ఓపెనర్‌గా రచిన్ రవీంద్రను ఎంపిక చేశా. అతడు రెండు సెంచరీలు చేశాడు. ఇక వన్‌డౌన్‌లో విరాట్ కోహ్లీనే ఆడాలి. మ్యాచ్ పరిస్థితిని అంచనా వేసి రాణించడం అతడికి అలవాటు. శ్రేయస్ అయ్యర్‌ను నాలుగో స్థానంలో ఆడిస్తా. భారత విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. సెమీస్, ఫైనల్‌లో విలువైన పరుగులు రాబట్టాడు. వికెట్ కీపర్ కమ్ బ్యాటర్‌గా కేఎల్ రాహుల్, ఆరో స్థానంలో గ్లెన్ ఫిలిప్స్ ఆడతారు. అతడు అద్భుతమైన బౌలరే కాకుండా.. ప్రమాదకరమైన ఫీల్డర్ కూడా. అజ్మతుల్లా ఒమర్జాయ్‌ను ఏడో స్థానంలో ఆడిస్తా. ఆల్‌రౌండర్ పాత్రకు సరిగ్గా సరిపోతాడు" అని వెల్లడించాడు.

**వరుణ్, షమీకి ఛాన్స్..**

"బౌలింగ్ విభాగంలో మంచి పోటీనే ఉంది. ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగుతా. భారత్ మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తిని తీసుకుంటా. ఇక రెండో స్పిన్నర్‌గా మిచెల్ శాంట్నర్, అక్షర్ పటేల్ రేసులో నిలిచారు. నేను మాత్రం శాంట్నర్ వైపు మొగ్గు చూపించా. టీమ్ఇండియా సీనియర్ పేసర్ షమీ, మ్యాట్ హెన్రీని ఫాస్ట్ బౌలర్లుగా తీసుకున్నా" అని బసిత్ అలీ వ్యాఖ్యానించాడు.

బసిత్ అలీ జట్టు ఇదే: రోహిత్ శర్మ (కెప్టెన్), రచిన్ రవీంద్ర, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, గ్లెన్ ఫిలిప్స్, అజ్మతుల్లా ఒమర్జాయ్, మిచెల్ శాంట్నర్, షమీ, హెన్రీ, వరుణ్ చక్రవర్తి.

## గౌతమ్ గంభీర్‌ను చాలా టిప్స్ అడిగా: డ్వేన్ బ్రావో

**ఇంటర్నెట్ డెస్క్:** డిఫెండింగ్ ఛాంపియన్స్ కోల్‌కతా నైట్‌రైడర్స్ ఐపీఎల్ 18వ సీజన్ కోసం సిద్ధమవుతోంది. ఇప్పటికే సారథిగా అజింక్య రహానెను ప్రకటించిన సంగతి తెలిసిందే. గతేడాది గౌతమ్ గంభీర్ మెంటార్‌గా వ్యవహరించాడు. అతడు భారత జట్టు ప్రధాన కోచ్‌గా రావడంతో.. డ్వేన్ బ్రావోను మెంటార్‌గా నియమిస్తూ కేకేఆర్ నిర్ణయం తీసుకుంది. మెంటార్‌గా బ్రావో బాధ్యతలను స్వీకరించాడు. మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న కొత్త సీజన్‌కు సంబంధించి సన్నాహకంపై బ్రావో స్పందించాడు.

'వివిధ కారణాల వల్ల మేం కొంతమందిని మిస్ అయ్యాం. జట్టుతో వ్యవహరించిన తీరు ఒక్కొక్కరికీ విభిన్నంగా ఉంటుంది. గౌతమ్ గంభీర్ స్టైల్ వేరు. నాకంటూ ఒక శైలి ఉంది. ఆ మార్గంలో ఇద్దరం సక్సెస్ అయ్యామని భావిస్తున్నా. పలుమార్లు గంభీర్‌కు మెసేజ్ చేశా. చాలా టిప్స్ అడిగా. కేకేఆర్ దగ్గరే అద్భుతమైన సక్సెస్ ఫార్ములా ఉంది. వాటిపైనే ఎక్కువగా ఆధారపడి పనిచేస్తా. గత సీజన్‌లో గంభీర్ మార్గదర్శకంలో కేకేఆర్ ఆడింది. ఆ సీజన్‌కు సంబంధించి మంచి విషయాలను తీసుకోవాలి" అని బ్రావో తెలిపాడు.

**రహానెకి కెప్టెన్సీ ఇవ్వడానికి కారణమదే: వెంకీ మైసూర్**

భారీ మొత్తం వెచ్చించి కొనుగోలు చేసిన వెంకటేశ్ అయ్యర్‌ను కాదని వెటరన్ ప్లేయర్ అజింక్య రహానెకు కెప్టెన్సీ ఇవ్వడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. దానిపై ఇప్పటికే సమాధానం ఇచ్చిన కేకేఆర్ సీఈవో వెంకీ మైసూర్ మరోసారి స్పష్టత ఇచ్చారు.



"ఇతర లీగ్‌లతో పోలిస్తే ఐపీఎల్ విభిన్నమైన టోర్నమెంట్. ఇక్కడ ప్రతి అంశంపై మేం ఆలోచించే నిర్ణయం తీసుకుంటాం. వెంకటేశ్ అయ్యర్ విషయంలో కూడా అలానే ఉంటాం. కుర్రాడికి కెప్టెన్సీ అప్పగిస్తే ఎలా ఉంటుందనేది పరిశీలించాం. అయితే, సారథ్యమంటే చాలా సవాళ్లతో కూడుకున్నది. జట్టును ముందుకు నడిపించాల్సిన అవసరం ఉంది. అందుకు అనుభవం కూడా కీలకమే. అజింక్య రహానె మంచి ఎంపిక అవుతుందని భావిస్తున్నాం. ఇదేమీ ఒక్కసారిగా తీసుకున్న నిర్ణయం కాదు. అతడికి ఎంతో అనుభవం ఉంది. అంతర్జాతీయంగానూ కెప్టెన్సీ చేశాడు. 185 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడాడు. దేశవాళీలో ముంబయిని నడిపించాడు. రహానె నాయకత్వంలో వెంకటేశ్ అయ్యర్ తప్పకుండా మంచి లీడర్‌గా ఎదుగుతాడని భావిస్తున్నాం" అని తెలిపారు.

## బీఎఫ్ఐ ఎలక్టోరల్ కాలేజ్ లిస్ట్ నుంచి అనురాగ్ ఠాకూర్ పేరు తొలగింపు



**ఢిల్లీ:** బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎన్నికల వేళ కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. కేంద్ర క్రీడా శాఖ మాజీమంత్రి అనురాగ్ ఠాకూర్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఎన్నికల నిమిత్తం ఇటీవల రిటర్నింగ్ అధికారి ఆమోదించిన ఎలక్టోరల్ కాలేజీ జాబితాలో ఠాకూర్ పేరు లేదు. అయితే ఆయన పేరును చేర్చేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దాంతో బీఎఫ్ఐ అధ్యక్ష పదవి కోసం పోటీపడదామనుకున్న ఆయనకు చుక్కెదురైంది.

అనురాగ్ ఠాకూర్.. బీసీసీఐ మాజీ అధ్యక్షుడు. మార్చి 28న జరగనున్న బీఎఫ్ఐ అధ్యక్ష పదవికి ఆయన పోటీ చేస్తారని భావించారు. ఈ ఎన్నికల కోసం హిమాచల్ ప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ఓటర్‌గా ఆయన్ను నామినేట్ చేసింది. అయితే బీఎఫ్ఐ అధ్యక్షుడు అజయ్ సింగ్ సంతకంతో విడుదలైన నోటిఫికేషన్‌లో ఠాకూర్ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేందుకు అనర్హుడు అని పేర్కొంది. ఆయన బాక్సింగ్ సంఘం రాజ్యాంగాన్ని, జాతీయ క్రీడా నియమావళిని ఉల్లఘించారని అందులో పేర్కొన్నారు. బీఎఫ్ఐ సెక్రటరీ హేమంత కలిత తర్వాత విడుదల చేసిన జాబితాలో క్రీడాశాఖ మాజీ మంత్రి పేరును చేర్చారు. అయితే ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఈ వ్యవహారంపై బీఎఫ్ఐ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్‌ను ఠాకూర్ బృందం ఆశ్రయించింది. అజయ్ సింగ్ ఇచ్చిన జాబితానే ఫైనల్ అని ఆయన తేల్చారు. దాంతో వారు కోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది.

## ఢిల్లీ క్యాపిటల్స్ సారథిగా అక్షర్ పటేల్



**ఇంటర్నెట్ డెస్క్:** ఐపీఎల్ 18వ సీజన్ మరో ఎనిమిది రోజుల్లో ప్రారంభం కానుంది. ఢిల్లీ క్యాపిటల్స్ తమ కెప్టెన్‌ను ప్రకటించింది. యువ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్‌కు అవకాశం కల్పించింది. సీనియర్ ప్లేయర్ కేఎల్ రాహుల్ జట్టులో ఉన్నప్పటికీ.. అతడు సారథ్యం తీసుకొనేందుకు మొగ్గు చూపలేదు. దీంతో అక్షర్ కు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తూ ఢిల్లీ ఫ్రాంచైజీ నిర్ణయం తీసుకుంది. ఈమేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు చేసింది. గత సీజన్‌లో జట్టును నడిపించిన రిషభ్ పంత్‌ను ఈసారి వదులుకున్న సంగతి తెలిసిందే. అతడిని లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ రూ. 27 కోట్లకు తీసుకుని కెప్టెన్సీ అప్పగించింది.

**కీలక ఆల్‌రౌండర్‌గా ఎదుగుతూ..**

ప్రస్తుత భారత క్రికెట్‌లో రవీంద్ర జడేజా స్పిన్ ఆల్‌రౌండర్. ఇప్పటికే టీ20లకు వీడ్కోలు పలికేశాడు. అతడి స్థానంలో టీమ్ఇండియాకు కీలకంగా మారే ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్. కేవలం బౌలింగ్‌లోనే కాకుండా బ్యాటింగ్‌లోనూ విలువైన పరుగులు చేయగలడు. ఇటీవల ముగిసిన ఛాంపియన్స్ ట్రోఫీలో అక్షర్ ఆటను చూశాం. ఐదో స్థానంలో వచ్చి కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఇప్పటి వరకు భారత్ తరఫున 14 టెస్టులు, 68 వన్డేలు, 71 టీ20లు ఆడిన అక్షర్.. 150 ఐపీఎల్ మ్యాచుల్లో పాల్గొన్నాడు. ఐపీఎల్‌లో 1,653 పరుగులు, 123 వికెట్లు పడగొట్టాడు.

## అక్కడ పురుషులంతా మహిళలుగా ముస్తాబు

### హోలీ వేళ కర్నూలు జిల్లాలో వింత ఆచారం



**ఆదోని, (విశాఖ సమాచారమ్):-** హోలీ అంటే మనకు వెంటనే గుర్తొచ్చేది రంగులు చల్లుకోవడం, కాముని దహనం. చిన్న పెద్దా అనే తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంబరాల్లో మునిగి తేలుతారు. ఇక యువకులు రంగుల నీళ్లు చల్లుకుంటూ డాన్సులు చేస్తూ తెగ సందడి చేస్తారు. అయితే ఆ గ్రామంలో యువకులు మాత్రం హోలీ రోజున వింత ఆచారం పాటిస్తారు. చీరలు కట్టుకొని ఆభరణాలు, పువ్వులతో సింగారించుకుని.. ఆడవారి వేషధారణలో మారిపోతారు.

కర్నూలు జిల్లా ఆదోని మండలం సంతేకుడ్లూరులో ఎన్నో ఏళ్ల నుంచి ఈ వింత ఆచారం పాటిస్తున్నారు. దశాబ్దాలుగా గ్రామస్థులంతా కలిసికట్టుగా ఈ హోలీ పండుగ జరుపుకోవడం విశేషం. గ్రామంలోని పురుషులు చీరలు కట్టుకుని స్త్రీ వేషధారణలో రతీ మన్మథస్వామికి పూజలు నిర్వహించారు. హోలీ నాడు స్త్రీల వేషంలో మన్మథస్వామిని దర్శించుకుంటే శుభం జరుగుతుందని, కోరికలు నెరవేరతాయని, గ్రామంలో కరవు, కాటకాలు రావని గ్రామస్తులు విశ్వసిస్తారు. ఈ ఆచారం రెండు రోజుల పాటు కొనసాగుతుంది. ఈ వింత ఆచారాన్ని చూసేందుకు తెలంగాణ, కర్ణాటక ప్రజలు కూడా అక్కడికి వెళుతుంటారు.

## చైనా ప్రాజెక్టులు, పాక్ సైనికులే లక్ష్యం?

**ఇంటర్నెట్‌డెస్క్:** పాకిస్థాన్ రైలు హైజాక్‌తో ఇప్పుడు మాజిద్ బ్రిగేడ్ ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ దళం ముఖ్యంగా చైనా ప్రాజెక్టులను లక్ష్యంగా చేసుకుంటోంది. పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్‌లో ఏకంగా రైలునే హైజాక్ చేసి మాజిద్ బ్రిగేడ్ వార్తల్లో నిలిచింది. పాక్ సైన్యం లక్ష్యంగా ఈ దళం పలు ఆత్మాహుతి దాడులు చేసింది. బలోచ్ ఉద్యమకారులను మట్టుబెట్టే కిరాయి ముఠాలను కూడా ఈ దళమే వేటాడుతోంది. ఇక తమ భూభాగంలో చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్‌ను వ్యతిరేకిస్తూ భారీ దాడులు నిర్వహించింది.

**నాటి ప్రధానిపై హత్యాయత్నంతో**

ఒక ప్రధానిపై హత్యాయత్నం చేసిన వ్యక్తితో ఈ బ్రిగేడ్ పుట్టుకకు బీజం పడింది. పాక్ మాజీ ప్రధాని జుల్ఫికర్ అలీ భుట్టో బలోచ్ ఉద్యమాన్ని అణచివేసేందుకు భారీ ఆపరేషన్లు నిర్వహించారు. దీంతో 1974 ఆగస్టు 2న మాజిద్ లాంగోవ్ సీనియర్ అలియాస్ అబ్దుల్ మాజీద్ బలోచ్ అనే మిలిటెంట్ భుట్టోపై హత్యాయత్నం చేశాడు. క్వెట్టాలో ప్రధాని కార్యక్రమానికి సమీపంలో ఓ చెట్టుపై గ్రనేడ్‌తో కూర్చొన్నాడు. కానీ, పొరపాటున అది చేతిలోనే పేలడంతో ప్రాణాలు కోల్పోయాడు. దీంతో అతడి తమ్ముడు జూనియర్ మాజిద్ ఈ పోరాటం బాధ్యతలు తీసుకొన్నాడు. 2010లో పాక్ సైన్యం క్వెట్టాలో ఓ ఇంటిపై దాడి చేసింది. అక్కడ జూనియర్‌తోపాటు పలువురు బలోచ్ మిలిటెంట్లు ఉన్నారు. దీంతో సైన్యాన్ని ఆపే పని మాజిద్ జూనియర్ తీసుకొన్నాడు. ఈ లోపు అతడి మిత్రులు అక్కడి నుంచి తప్పించుకున్నారు. ఓ గంట పాటు పోరాడిన జూనియర్ చివరికి సైన్యం చేతిలో మరణించాడు. దీంతో మాజిద్ సోదరులు బలోచ్ ఉద్యమంలో బాగా పాపులర్ అయ్యారు. వీరి స్ఫూర్తితో అస్లాం ఆచు అనే మిలిటెంట్ 2011లో బలోచ్ లిబరేషన్ ఆర్మీ కోసం ఆత్మాహుతి దళాన్ని ఏర్పాటు చేశాడు. దానికి మాజిద్ బ్రిగేడ్ అని పేరుపెట్టాడు.

**చైనా ప్రాజెక్టులను ఉక్కిరిబిక్కిరి చేస్తూ..**

బలోచ్ లిబరేషన్ ఆర్మీని అంతం చేసేందుకు పాక్ సైన్యం ఆ ప్రాంతంలో కిరాయి ముఠాలను కూడా వాడుతోంది. వాటిల్లో షఫీక్ మెంగల్ గ్రూప్ ఒకటి. మాజిద్ బ్రిగేడ్ తొలిదాడి దీనిపైనే చేసింది. ఈ దాడి నుంచి షఫీక్ తప్పించుకున్నా.. మొత్తం 14 మంది చనిపోగా.. 35 మంది గాయపడ్డారు. బీఎల్‌ఏ కోసం ఈ బ్రిగేడ్ ఇప్పటి వరకు 12 భారీ ఆత్మాహుతి దాడులు చేసింది.

2018 ఆగస్టులో బలోచిస్థాన్‌లోని దల్బందిన్ వద్ద చైనా ఇంజినీర్లను టార్గెట్ చేసుకుని ఆత్మాహుతి దాడి చేసింది. ఈ ఘటనలో ఐదుగురు గాయపడ్డారు.

2018 నవంబర్‌లో కరాచీలోని చైనా దౌత్యకార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని దాడి చేసింది. గంటలతరబడి జరిగిన ఈ దాడితో కరాచీ దద్దరిల్లిపోయింది. ముగ్గురు మిలిటెంట్లతో కలిపి మొత్తం ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు.

గ్వాదర్‌లో పెరల్ కాంటినెంటల్ హోటల్‌పై 2019లో దాడి చేసింది. కొన్ని గంటలపాటు జరిగిన ఈ దాడితో చైనా ఇన్వెస్టర్లలో భయం రేకెత్తించింది.

2020 జూన్‌లో కరాచీ స్టాక్ ఎక్స్ఛేంజిని లక్ష్యంగా చేసుకుని మాజిద్ బ్రిగేడ్ విరుచుకుపడింది. దీనిని చైనాకు చెందిన ఓ కన్సార్టియం నిర్వహించడమే దాడికి కారణంగా తెలుస్తోంది.

2024 అక్టోబర్‌లో కరాచీ ఎయిర్ పోర్టు వద్ద ఆత్మాహుతి దాడి చేసింది. దీనిలో ఇద్దరు చైనా ఇంజినీర్లు ప్రాణాలు కోల్పోయారు.

**మాజిద్‌కు అండగా ఫతే స్క్వాడ్..**

తాజాగా రైలు హైజాక్‌లో మాజిద్ బ్రిగేడ్‌కు అండగా.. ఫతే స్క్వాడ్ పాల్గొంది. ఇది బలోచిస్థాన్‌లోని కఠినమైన పర్వత ప్రాంతాల్లో ఆపరేషన్లు నిర్వహిస్తుంది. గెరిల్లా యుద్ధతంత్రంలో ఈ దళం ఆరితేరింది. ముఖ్యంగా పాక్ సైనిక కాన్వాయ్‌లను చుట్టుముట్టి దాడి చేయడం దీని శైలి. 2024లో ఫతే స్క్వాడ్ బీఎల్‌ఏలోని ఇతర గ్రూప్‌లతో కలిసి బలోచిస్థాన్ ప్రధాన మార్గాల్లో 14 బ్లాకేడ్‌లను ఏర్పాటు చేసింది. ఈ క్రమంలో 62 మంది పాక్ సైనికులను హత్య చేసింది.




VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123
Hyderabad (Sai Ganesh) : Cell : 9030841841, Parawada (satyanarayana): Cell: 77804 33919, Srikakulam : Cell: 70321 98574, For advertisements (Raghunath) : 7013785256, Arilova (D.Venkatesh) : 94937 77390.
Maddilapalem (G.Raamakrishna) : 99084 24231, Anakapalli (M.Krishna Rao) : 63023 75539, Chintapalli (Srinivas) : 94923 40861.
Bheemunipatnam (B.Appalareddy) : 98662 78981, Srikakulam (Ramarao) : 70321 98574, Pithaapuram (staalin) : 94912 23264,

గమనిక : ఇక్కడ ఇవ్వబడిన పేర్లు కలిగిన వారిని మాత్రమే విశాఖ సమాచారమ్ దినపత్రికకు విలేఖరులుగా గుర్తించవలెను. ఇక్కడ పేరు లేకుండా ఎవరైనా విశాఖ సమాచారమ్ ప్రతినిధిగా చెబితే నమ్మవద్దు.